thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 126| జగిత్యాల | శుక్రవారం 07 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

వచ్చే ప్రపంచ కప్ కు కౌంట్ డౌన్ ప్రారంభం




11

## విద్య వ్యాపారంగా మారింది



- నిరుద్యోగం, విద్య, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఉద్యమం : అభిజిత్ దీప్కే
- ప్రెజర్ గ్రూపుగానే కొనసాగుతాం.. ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదు
- 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త ప్రచారానికి శ్రీకారం

4

## అగ్ని-4 క్షిపణి పరీక్ష సక్సెస్



- ఒడిశాలోని చాందీపూర్ నుంచి ప్రయోగం విజయవంతం
- 4,000 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం

4

## తెహల్కా మాజీ ఎడిటర్‌కు 10 ఏళ్ల జైలు

- లైంగిక దాడి కేసులో హైకోర్టు సంచలన తీర్పు

4





# ఒకే వ్యవస్థలో రోడ్ల నిర్వహణ

- హైదరాబాద్ రోడ్ నెట్‌వర్క్‌పై సీఎం కీలక ఆదేశాలు
- డిసెంబర్ 9లోగా తొలి రేడియల్ రోడ్ పూర్తి చేయాలని నిర్దేశం
- భూసేకరణ వేగవంతం.. నాణ్యతలో రాజీ లేదన్న సీఎం రేవంత్

2

రాష్ట్రంలో ప్రజల రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచడానికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకు రావాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలో కీలకమైన రోడ్ నెట్‌వర్క్ విస్తరణ, ప్రస్తుతం జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని 'బోధి పెవిలియన్'లో హెచ్ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్ల నిర్మాణానికి అత్యంత ప్రధానమైన భూసేకరణ, రుణ సేకరణ, నిర్వహణ వంటి అంశాలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, నగర పరిధిలోని ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఇతర రోడ్లన్నింటినీ సమగ్రంగా ఒకే వ్యవస్థ కిందికి తీసుకురావాలని సీఎం సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణ సరిగా లేకపోవడం, దానిపై ఎక్కడికక్కడ వాహనాలను నిలపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

*- హైదరాబాద్, ఆగస్టు 6*

## ప్రొఫె'సర్'కు సీఎం నివాళి

- ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయం
- ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న రేవంత్



2

## కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ
1.05 కోట్ల ల్యామినేటెడ్ కార్డులు అర్హులకు
సంగారెడ్డిలో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం



తెలంగాణలో కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను విస్తరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

2

## తరగతి గదిలో పాముకాటు



- మూడో తరగతి విద్యార్థి మృతి
- పాఠశాలలోనే విషాదం..
- చికిత్స పొందుతూ చిన్నారి కన్నుమూత
- భద్రతా లోపాలపై ఆవేదన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

2

## బోనాల వేళ ఆకతాయిల ఆటకట్టు

షీటీమ్స్ ప్రత్యేక నిఘా

- 678 మంది ఈవ్‌టీజర్ల గుర్తింపు
- 25 మందికి జైలు..
- పలువురికి జరిమానాలు
- సామాజిక సేవ శిక్షలు

2

బోనాల ఉత్సవాల సందర్భంగా మహిళల భద్రత కోసం రంగంలోకి దిగిన షీటీమ్స్ ఆకతాయిల ఆటకట్టించాయి. ఉత్సవాల వేళ వివిధ దేవాలయాల వద్ద మహిళలను వేధింపులకు గురిచేసిన 678 మంది ఈవ్‌టీజర్లను షీటీమ్స్ ప్రత్యేక నిఘాతో గుర్తించాయి. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా నిఘా పెంచిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజీలు, వీడియో ఆధారాల సాయంతో నిందితులను పట్టుకుని కేసులు నమోదు చేశారు.




## స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష



- తెలంగాణ కోసం చివరి శ్వాస వరకు తపించిన జయశంకర్
- కేసీఆర్ పట్టుదలపై సంపూర్ణ విశ్వాసంతో వెన్నంటి నిలిచారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఘన నివాళులు

3

కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు నీటి విషయంలో మళ్లీ అన్యాయం జరుగుతోందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని పొరుగు రాష్ట్రం ఏపీ విజ్ఞప్తి చేస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం సరైన రీతిలో స్పందించడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి ఇప్పటివరకు అనేకసార్లు ఢిల్లీ పర్యటనలకు వెళ్లారని, స్వీయ రాజకీయాస్తిత్వాన్ని విడిచిపెట్టి ఢిల్లీ ముందు యాచించే పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కాంప్రమైజ్ కాకుండా గర్జించే నాయకత్వమే శ్రీరామరక్ష అని, అందుకే కాంగ్రెస్‌లో విలీనం కావొద్దని ఆనాడు జయశంకర్ సార్ స్పష్టంగా చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు.

## సింగరేణి చరిత్రలో స్వర్ణాధ్యాయం

- ఒడిశా నైనీ గని నుంచి తొలిసారి తెలంగాణకు బొగ్గు
- జైపూర్ థర్మల్ కేంద్రానికి చేరిన 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు
- విద్యుత్ రంగానికి కొత్త ఊపు.. చారిత్రక ఘట్టమన్న భట్టి విక్రమార్క

2



## గోదావరి ప్రాజెక్టులకు సమాధి కట్టే కుట్ర

- ఏపీ డైరెక్షన్‌లో జీఆర్ఎంబీ నడుస్తోంది
- 'జై తెలంగాణ' అనని వ్యక్తి సీఎంగా ఉన్నారు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

3

## ఆగస్టు 15 నుంచే కొత్త ఆసరా పింఛన్లు

- అర్హులందరికీ పింఛన్ అందిస్తాం: మంత్రి పొంగులేటి
- భూ భారతి ద్వారా డిజిటల్ హక్కు పత్రాలు
- పేదలకు ఎలాంటి అన్యాయం జరగనివ్వమని హామీ

2




# బోనాల వేళ ఆకతాయిల ఆటకట్టు

**షీటీమ్స్ ప్రత్యేక నిఘా.. 678 మంది ఈవ్‌టీజర్ల గుర్తింపు**

**25 మందికి జైలు.. పలువురికి జరిమానాలు, సామాజిక సేవ శిక్షలు**

**హైదరాబాద్, ఆగస్టు 6:** బోనాల ఉత్సవాల సందర్భంగా మహిళల భద్రతకు భంగం కలిగించే ఆకతాయిలపై షీటీమ్స్ ఉక్కుపాదం మోపాయి. దేవాలయాల వద్ద మహిళలను వేధింపులకు గురిచేసిన ఘటనలపై ప్రత్యేక నిఘా చేపట్టి మొత్తం 678 మంది ఈవ్‌టీజర్లను గుర్తించాయి. మహిళల నుంచి అందిన ఫిర్యాదులు, సీసీటీవీ దృశ్యాలు, వీడియో ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించిన షీటీమ్స్, వారిపై కేసులు నమోదు చేశాయి. విచారణ అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా పలువురికి శిక్షలు విధించారు. న్యాయస్థానం 25 మందికి జైలు శిక్షతో పాటు జరిమానా, మరో 11 మందికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,050 జరిమానా విధించింది. అదనంగా 26 మందికి రూ.1,050 చొప్పున జరిమానా విధిస్తూ సామాజిక సేవ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వేధింపులకు పాల్పడడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని పోలీసులు స్పష్టం చేశారు. మహిళల భద్రతకు భంగం కలిగించే వారిపై భవిష్యత్తులోనూ కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# తరగతి గదిలో పాముకాటు

**మూడో తరగతి విద్యార్థి మృతి.. పాఠశాలలోనే విషాదం..**

**భద్రతా లోపాలపై ఆవేదన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు**



**నారాయణపేట, ఆగస్టు 6:** నారాయణపేట జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విషాద ఘటన చోటుచేసుకుంది. తరగతి గదిలో చదువుకుంటున్న ఎనిమిదేళ్ల విద్యార్థిని పాము కాటేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న పిచ్చికుంట్ల రంజిత్ (8) బుధవారం తరగతి గదిలో ఉండగా ఒక్కసారిగా పాము కాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు వెంటనే బాలుడిని నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో రంజిత్ ప్రాణాలు కోల్పోయాడు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య లోపాలు, పొదలు, చెత్త పేరుకుపోవడం వల్లే పాములు సంచరిస్తున్నాయని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పాములు, విషపురుగులు ప్రవేశించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు.

# ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డి

**ట్రైనీ ఐపీఎస్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు**

**నేటితో ముగియనున్న పోలీస్ కస్టడీ**



**హైదరాబాద్, ఆగస్ట్ 6:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటల వరకు కస్టడీ కొనసాగనుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీసీపీ .. అత్తాపూర్ పీఎస్‌కు చేరుకున్నారు. కృష్ణారెడ్డిని డీసీపీ పర్యవేక్షణలో సీఐ జ్యోత్స్న విచారిస్తున్నారు. కస్టడీలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. విచారణలో కీలక ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా మిస్సైన మొబైల్ ఫోన్‌పై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డి రెండో మొబైల్ పైన ఆరా తీస్తున్నారు. మిస్సైన రెండో మొబైల్ దొరికినట్లయితే మరికొన్ని కీలక అంశాలు బయటపడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఉదయ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేసి ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమిలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని గత నెల 28న పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అధికారులు ఉప్పరపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. రెండు రోజుల పాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉదయ్ కృష్ణారెడ్డిని కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌తో పరిచయం, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై పోలీసుల విచారణ కొనసాగనుంది.

# ఒకే వ్యవస్థలో రోడ్ల నిర్వహణ

**హైదరాబాద్ రోడ్ నెట్‌వర్క్‌పై సీఎం కీలక ఆదేశాలు**

- డిసెంబర్ 9లోగా తొలి రేడియల్ రోడ్ పూర్తి చేయాలని నిర్దేశం
- భూసేకరణ వేగవంతం.. నాణ్యతలో రాజీ లేదన్న సీఎం



**హైదరాబాద్, ఆగస్టు 6:** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు హైదరాబాద్, హెచ్‌ఎండీఏ పరిధిలోని రోడ్ల నిర్మాణం, నిర్వహణ, విస్తరణకు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్‌రోడ్, నగరంలోని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ప్రధాన రహదారుల నిర్మాణం, భూసేకరణ, రుణాల సమీకరణ, నిర్వహణ వంటి అన్ని అంశాలను సమన్వయంతో నిర్వహించేలా ఒకే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు నిర్మిస్తున్న రేడియల్ రోడ్-1ను డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఎదురయ్యే అడ్డంకులను వెంటనే తొలగించాలని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. రోడ్లకు ఇరువైపులా విస్తృతంగా హరితవనం అభివృద్ధి చేయాలని, బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ నిర్మాణం, బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధి రోడ్ల విస్తరణపై ఆధారపడి ఉందని పేర్కొన్న సీఎం, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి అవకాశం ఉండకూడదని, టీడీఆర్‌ల జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## ప్రొఫె'సర్'కు నివాళి

**ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం**

**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంత బలాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన గొప్ప మేధావిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ చూపిన మార్గంలో ముందుకు సాగుతూ, ఆయన ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే జయశంకర్ ఆశయాలకు నిజమైన నివాళిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# సింగరేణి చరిత్రలో స్వర్ణాధ్యాయం

- ఒడిశా నైనీ గని నుంచి తొలిసారి తెలంగాణకు బొగ్గు
- జైపూర్ థర్మల్ కేంద్రానికి చేరిన 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు
- విద్యుత్ రంగానికి కొత్త ఊపు.. చారిత్రక ఘట్టమన్న భట్టి విక్రమార్క



**మంచిర్యాల, ఆగస్టు 6:** సింగరేణి చరిత్రలో మరో కీలక మైలురాయి నమోదైంది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తి చేసిన తొలి బొగ్గు రైలు తెలంగాణలోని మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చేరుకుంది. 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో రాష్ట్రం వెలుపల ఉన్న సొంత గని నుంచి బొగ్గు ఉత్పత్తి చేసి, తెలంగాణలోని విద్యుత్ కేంద్రానికి తరలించడం ఇదే తొలిసారి కావడం విశేషం. 59 రైల్వే వ్యాగన్లలో సుమారు 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు జైపూర్ థర్మల్ కేంద్రానికి చేరుకోగా, సింగరేణి అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంపై ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేస్తూ సింగరేణి యాజమాన్యం, కార్మికులకు అభినందనలు తెలిపారు. తెలంగాణలో విద్యుత్ కొరత లేకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నైనీ గని నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇంధన సరఫరా మరింత బలోపేతమవుతుందని, భవిష్యత్తులో కొత్త బొగ్గు గనుల సాధనకు కూడా ప్రయత్నాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నైనీ బొగ్గు గని అభివృద్ధి కోసం అనుమతుల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో చర్చలు జరపడంతో అనుమతుల ప్రక్రియ వేగవంతమైందని వెల్లడించారు. 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం, అక్కడి నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణకు చేరుకుంది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2015లో సింగరేణికి కేటాయించిన నైనీ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు అంచనా. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, సంవత్సరానికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. నాణ్యమైన బొగ్గు అందుబాటులోకి రావడంతో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఇంధన భద్రత మరింత బలోపేతం కానుందని, రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాకు ఇది కీలక మద్దతు అందించనుందని ప్రభుత్వం భావిస్తోంది. సింగరేణి కీర్తి కిరీటంలో నైనీ గని మరో చారిత్రక అధ్యాయంగా నిలిచిపోతుందని అధికారులు పేర్కొన్నారు.

# ఆగస్టు 15 నుంచే కొత్త ఆసరా పింఛన్లు

**అర్హులందరికీ పింఛన్ అందిస్తాం: మంత్రి పొంగులేటి**

**త్వరలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.. భూ భారతి ద్వారా డిజిటల్ హక్కు పత్రాలు**

**పేదలకు ఎలాంటి అన్యాయం జరగనివ్వమని హామీ**



**ఖమ్మం, ఆగస్టు 6:** స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుదిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఏ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, నేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున, దివ్యాంగులు, తీవ్రమైన శారీరక వైకల్యం ఉన్న వారికి రూ.4,016 చొప్పున ఆసరా పింఛన్ అందజేస్తోందని మంత్రి తెలిపారు. ఫైలేరియా బాధితులకు కూడా నెలకు రూ.2,016 ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే చేపట్టి 'భూ భారతి' కార్యక్రమం ద్వారా డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూమి హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అనర్హుల పేర్లపై ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేసి, నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను మరో రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామని వెల్లడించిన మంత్రి, అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రాబోయే తొలి పంటకే సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ
- 1.05 కోట్ల ల్యామినేటెడ్ కార్డులు అర్హులకు
- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం




**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణలో కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను విస్తరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించనున్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజకవర్గంలో పర్యవేక్షణ బాధ్యతలను ఆర్డీవోలకు అప్పగించినట్లు ప్రభుత్వం తెలిపింది. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్డులు తీసుకునేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంపిణీ పూర్తయిన వెంటనే ప్రతి నియోజకవర్గం నుంచి సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని కూడా స్పష్టం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏ ఒక్క అర్హుడు కూడా ఈ పథకానికి దూరం కాకుండా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం" అని తెలిపారు.

# స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష

- తెలంగాణ కోసం చివరి శ్వాస వరకు తపించిన జయశంకర్ సార్
- కేసీఆర్ పట్టుదలపై సంపూర్ణ విశ్వాసంతో వెన్నంటి నిలిచారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఘన నివాళులు



**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పనిచేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు మించిన దక్షత, నిబద్ధత, తెలంగాణ సాధించాలనే పట్టుదల ఉన్న నాయకుడిని చూపిస్తే ఆయన వెంట నడుస్తానని జయశంకర్ సార్ బహిరంగంగానే చెప్పేవారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ సాధన లక్ష్యంగా ఏర్పడిన ఇతర రాజకీయ పార్టీల విషయంలోనూ విభేదాలు కాకుండా లక్ష్యసారూప్యత ఉండాలని ఆయన ఎప్పుడూ సూచించేవారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్ని కొత్త పార్టీలు వచ్చినా, అందరి లక్ష్యం తెలంగాణ రాష్ట్ర సాధనే కావాలని జయశంకర్ సార్ ఆకాంక్షించారని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమ శక్తులు పరస్పరం కలహించకుండా సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించేవారని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ నీటి హక్కులకు మళ్లీ ముప్పు ఏర్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణకు సంబంధించిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కేంద్రాన్ని కోరుతోందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా స్పందించడం లేదని విమర్శించారు. తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదా అని ప్రశ్నించారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోల్చిన వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎవరూ స్పందించలేదని, బీఆర్ఎస్ ప్రతినిధులు ఉంటే గట్టిగా నిలదీసేవారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తుండడాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణ నాయకత్వం ఢిల్లీపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఉండాలని జయశంకర్ సార్ ఎప్పుడూ కోరుకున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే నిజమైన రక్షణ అని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా గళమెత్తే నాయకత్వం అవసరమని జయశంకర్ సార్ విశ్వసించారని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ తరహా ధైర్యవంతమైన నాయకత్వమే అవసరమని, అదే జయశంకర్ సార్ ఆకాంక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.

# గోదావరి ప్రాజెక్టులకు సమాధి కట్టే కుట్ర

- ఏపీ డైరెక్షన్‌లో జీఆర్ఎంబీ నడుస్తోంది
- 'జై తెలంగాణ' అనని వ్యక్తి సీఎంగా ఉన్నారు: హరీశ్‌రావు
- జయశంకర్ ఆరాటం.. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధ్యమైందని వ్యాఖ్య



**సిద్దిపేట, ఆగస్టు 6:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) ఆంధ్రప్రదేశ్ డైరెక్షన్‌లో పనిచేస్తోందని, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా చూస్తోందని విమర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని, "జై తెలంగాణ" అని ఎప్పుడూ పలకని వ్యక్తి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ప్రొఫెసర్ జయశంకర్ ఆరాటం, కేసీఆర్ పోరాటమే ప్రధాన కారణమని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గోదావరి జలాల్లో 380 టీఎంసీల నీటిని తెలంగాణ హక్కుగా సాధించామని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమానికి నీటి హక్కులే ప్రధాన ప్రేరణగా నిలిచాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు సాధించలేకపోయిందని ఆయన విమర్శించారు. గతంలో జీఆర్ఎంబీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలను తిప్పికొట్టి తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చామని, ఇప్పుడు ఇప్పటికే అనుమతులు పొందిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి పునఃసమీక్షించాలనే అంశాన్ని అజెండాలో చేర్చడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీటి హక్కులపై చిత్తశుద్ధి ఉంటే జీఆర్ఎంబీ అజెండాను వెంటనే మార్చించాలని, అవసరమైతే ఆ సమావేశాన్ని బహిష్కరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీ అనుమతులు వచ్చినప్పటికీ ప్రభుత్వం దానిని ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని నిలదీశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ రెండో దశకు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు నీరు కీలకమని పేర్కొన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. మొదట జీఆర్ఎంబీ అజెండాలో లేదని చెప్పి, తర్వాత ఢిల్లీలో జరిగిన సమావేశంలో చేర్చి, సమావేశానికి వెళ్లమని చెప్పి చివరకు సంతకాలు చేశారని విమర్శించారు. కోర్టుల్లో ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యాల నిర్వహణ కూడా పూర్తిగా విఫలమైందని, కనీసం రిట్ పిటిషన్‌ను సక్రమంగా నిర్వహించే సామర్థ్యం కూడా ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు.

# సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**హైదరాబాద్, ఆగస్టు 6:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.





# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

## గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణ సిద్ధాంతకర్త, స్వర్గీయ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సభలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మంత్రి హాజహరుద్దీన్ పాల్గొన్నారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఆవశ్యకతను విద్యార్థులకు, ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించి ఉద్యమానికి దిశానిర్దేశం చేశారని చెప్పారు. అలాగే, జయశంకర్ ఆశయాలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరాల్సి ఉందని పేర్కొంటూ, హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ నేతలు తమ రాజధాని అమరావతిలో స్థిరపడితేనే జయశంకర్ కోరుకున్న తెలంగాణ పూర్తిస్థాయిలో సాకారమైనట్లుగా భావిస్తామని వ్యాఖ్యానించారు. జయశంకర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత తమ జీవిత లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.



# కేటీఆర్‌తో అంబేద్కర్ మనవడి భేటీ

**హైదరాబాద్, ఆగస్ట్ 6:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో వంచిత్ బహుజన్ అగాడీ అధినేత ప్రకాష్ అంబేద్కర్ గురువారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ బంజారాహిల్స్ లోని నివాసంలో కేటీఆర్‌తో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, పార్టీ నాయకులను కేటీఆర్ పరిచయం చేశారు. భేటీ అనంతరం ప్రకాష్ అంబేద్కర్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు దేశంలో తొలి స్థానం




**హైదరాబాద్, ఆగస్టు 6 :** సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన సేవలందించడంలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలిచినట్లు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షిఖా గోయల్ తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయం నిర్వహించిన 'ప్రగతి' సమీక్షలో కేంద్ర హోంశాఖ పరిధిలోని డిజిటల్ సైబర్ వ్యవస్థల వినియోగం, పనితీరు ఆధారంగా తెలంగాణకు ఈ గుర్తింపు లభించినట్లు వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర సైబర్ నేరాల సమన్వయ కేంద్రం ఏర్పాటు, డిజిటల్ జీరో ఎఫ్ఐఆర్ అమలు, ఫిర్యాదుల పరిష్కారం, మనీ రెస్టోరేషన్, 'సహాయోగ్' వేదిక, అంతర్రాష్ట్ర సమన్వయం, సైబర్ హాట్‌స్పాట్ల గుర్తింపు, అధికారులకు శిక్షణ, ప్రజల్లో అవగాహన కల్పన వంటి తొమ్మిది కీలక అంశాల్లో రాష్ట్రం అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు కేంద్రం ప్రశంసించింది. ఆగస్టు 2 నాటికి ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 2,368 దరఖాస్తుల్లో 2,086 పరిష్కరించి 88 శాతం విజయాన్ని నమోదు చేసింది. మనీ రెస్టోరేషన్ వేదిక ద్వారా రూ.16.42 కోట్ల మేర బాధితులకు తిరిగి అందించే ప్రక్రియ కొనసాగుతుండగా, 28,097 ఉత్తర్వులు జారీ అయ్యాయి. 'సహాయోగ్' వేదికలో 22,447 అనుచిత వెబ్ లింకుల్లో 20,070 తొలగించి 89.41 శాతం విజయాన్ని సాధించింది. అంతర్రాష్ట్ర సమన్వయ వేదికలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల్లో 96.68 శాతం పూర్తి చేసింది. బాధితుల సహాయార్థం ప్రత్యేక హెల్ప్‌లైన్ 8712665600ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు షిఖా గోయల్ తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఫిర్యాదు నమోదు చేసి, అందుబాటులో ఉన్న డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

# 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు

- హైదరాబాద్ పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోంది
- జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- మరో రెండేళ్లలో 1,600 మందికి ఉపాధి

**హైదరాబాద్, ఆగస్టు 6 :** గత 20 నెలల్లో తెలంగాణలో 150 కొత్త గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ఏర్పాటై, వాటి ద్వారా సుమారు 1.5 లక్షల మందికి ఉపాధి కల్పించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ (జోన్స్ లాంగ్ లాసెల్) సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన నగరాలను గుర్తించే జేఎల్ఎల్ వంటి అంతర్జాతీయ సంస్థ హైదరాబాద్‌ను తన జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం తెలంగాణపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. సంప్రదాయ ఐటీ సేవల కంటే ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్ ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయని చెప్పారు. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వంటి సాంకేతిక మార్పులు వచ్చినా జీసీసీల ప్రాధాన్యం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, 2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతానికి చేరుకోగా, నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతంగా నమోదైంది. ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాలకు చెందిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు కూడా హైదరాబాద్ తొలి ఎంపికగా నిలుస్తోందని చెప్పారు. జేఎల్ఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉపాధి లభించనుందని మంత్రి తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, సాంకేతిక సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎల్ఎల్ కార్యకలాపాలకు అందించనున్నారు.



## సంపాదకీయం



# పార్లమెంట్‌లో తగ్గుతున్న చర్చల స్థాయి

### ప్రజా సమస్యలపై దృష్టి పెట్టని అధికార, విపక్షాలు!

పార్లమెంట్ సమావేశాలు నానాటికీ దిగజారి పోతున్నాయి. అధికార, విపక్షాల పట్టుతో సమావేశాలు సాగడం లేదు. గందరగోళం మధ్యనే ప్రభుత్వం బిల్లులు పాస్ చేసుకుంటూ పోతోంది. విపక్షం కూడా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నచందంగా సాగుతోంది. చర్చలు జరక్కుండా ప్రజాధనం వృధా చేస్తున్నారు. వర్షాకాల సమావేశాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నాయి. అసలు మోడీ హయాంలో చర్చలు సాగడం లేదని అనుకుంటుంటే విపక్షం అంతకుమించి అన్నట్లుగా పార్లమెంట్ స్తంభనకే పట్టుబడతోంది. ఇది నిజంగా పార్లమెంట్ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే గత కొన్ని ఏళ్లుగా పరిశీలన చేస్తే అసలు చర్చలు సాగడం లేదు. అర్థవంతమైన చర్చలు అస్సలు చేయడం లేదు. విపక్షలు పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి, పార్లమెంట్ బయట ఆందోళనలు చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ఎన్నో అవకాశాలు ఉంటాయి. ఎన్నో రూల్స్ ఉంటాయి. వారు చర్చించాల్సిన విషయాలను ఈ పద్దతిలో చర్చించడం లేదు. కేవలం రాజకీయం క ఓసం రచ్చ మార్గాన్ని ఎన్నుకున్నాయి. ఇకపోతే స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్ష పాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరామ్ జాకడ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలకు ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసుకోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది అర్థం అవుతోంది. ఇలాంటి సందర్భాల్లో స్పీకర్ జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యులతో మాట్లాడడం, వారిని అనునయించడం జరిగేది. వారు ఏం కోరుకుంటున్నారో మైక్ ఇవ్వడం ద్వారా తెలుసుకోవచ్చు. కానీ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన అరోపణ. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు పదేపదే అరోపిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇక ఈ సీజన్‌లో అసలు విపక్ష సభ్యులు కూడా మాట్లాడకుండా పోడియం వద్దకు రావడం, నినాదాలు చేయడం, వెళ్లిపోవడం అలవాటు చేసుకున్నారు. దీంతో స్పీకర్ కూడా సభను వాయిదా వేసి పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ సభకు హాజరు కావడం లేదు. విద్యార్థుల సమస్యలు కావచ్చు, ఇతర సమస్యలు కావచ్చు..ప్రధాని మాట్లాడడం లేదు. కేవలం సోషల్ మీడియా ద్వారా తన భావాలను వెల్లడిస్తున్నారు. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా అర్థం అవుతోంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. సమావేశాల్లో అనేక అంశాలపై చర్చకు అవకాశం ఉంటుంది.కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్దంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని సభకు రావడం మర్యాద. విపక్షాలకు కూడా ఆయన సూచనలు చేయవచ్చు. కానీ మంత్రులతోనే పనికానిచ్చేద్దాఆమంటే సరికాదు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. దీనిని గుర్తించకుంటే ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారు.

# విద్య వ్యాపారంగా మారింది : అభిజీత్ దీప్కే

- నిరుద్యోగం, విద్య, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఉద్యమం
- ప్రెజర్ గ్రూపుగానే కొనసాగుతాం.. ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదు
- 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త ప్రచారానికి శ్రీకారం



**ముంబై, ఆగస్టు 6:** దేశంలో విద్య క్రమంగా వ్యాపార వస్తువుగా మారుతోందని, చిన్నారుల విద్యకే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య వ్యవస్థల జవాబుదారీతనం వంటి అంశాలపై దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో ప్రజా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. మహారాష్ట్రలో పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన దీప్కే, సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి విద్యార్థులు, యువత, సాధారణ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా విని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. సీజేపీని రాజకీయ పార్టీగా కాకుండా ప్రజల తరఫున పనిచేసే ప్రెజర్ గ్రూప్‌గానే కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై తగ్గుతున్న ప్రజా విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితికి చేరుకుందని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. గతంలో ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకునేవారని, ఇప్పుడు ఎవరు అధికారంలోకి రావాలనే దానిపై వ్యవస్థల ప్రభావం పెరుగుతోందని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా రంగంలో ఫీజుల భారం మధ్యతరగతి కుటుంబాలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌కేజీ నుంచే లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని, పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆకాంక్ష ఆర్థిక భారంగా మారుతోందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యను ప్రాథమిక హక్కుగా పేర్కొన్నప్పటికీ, ప్రస్తుతం అది వ్యాపారంగా మారిందని విమర్శించారు. పార్టీ సభ్యత్వం పూర్తిగా ఉచితమని, అధికారిక క్యూ ఆర్ కోడ్‌ల ద్వారానే నమోదు చేసుకోవాలని సూచించారు. తప్పుడు చెల్లింపు లింకులు, మోసపూరిత అభ్యర్థనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజల తరఫున ప్రభుత్వాలను జవాబుదారీగా నిలబెట్టే ఒత్తిడి వేదికగా సీజేపీ పనిచేస్తుందని, దేశంలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడమే తమ ఉద్యమం లక్ష్యమని అభిజీత్ దీప్కే తెలిపారు.



# తెహల్కా మాజీ ఎడిటర్‌కు 10 ఏళ్ల జైలు

**లైంగిక దాడి కేసులో హైకోర్టు సంచలన తీర్పు**

**5 లక్షల జరిమానా.. 2 వారాల్లో లొంగిపోవాలని ఆదేశం**

**ముంబై, ఆగస్టు 6:** తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు 2013లో నమోదైన లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గోవా బెంచ్ పదేళ్ల జైలు శిక్ష విధించింది. రూ.5 లక్షల జరిమానా కూడా విధించిన న్యాయస్థానం, రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. 2013లో గోవాలో జరిగిన 'థింక్‌ఫెస్ట్' కార్యక్రమం సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తనపై జూనియర్ సహోద్యోగినిపై లైంగిక దాడికి పాల్పడ్డారని నమోదైన కేసులో గతంలో గోవా ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే ఆ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాలు చేయగా, ట్రయల్ కోర్టు తీర్పును రద్దు చేసిన హైకోర్టు తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించి శిక్ష ఖరారు చేసింది. విచారణ సందర్భంగా గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, బాధితురాలు పలుమార్లు నిరాకరించినప్పటికీ తేజ్‌పాల్ ఆగలేదని, "నో అంటే నో" అనే మౌలిక సూత్రాన్ని విస్మరించారని కోర్టుకు వివరించారు. బాధితురాలు ఆయన కింద పనిచేసే ఉద్యోగి కావడంతో, అధికార అసమానతను తేజ్‌పాల్ దుర్వినియోగం చేశారని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. తీర్పు అనంతరం మీడియాతో మాట్లాడిన తరుణ్ తేజ్‌పాల్, తాను ఎలాంటి నేరం చేయలేదని, ఈ తీర్పుతో ఏకీభవించడం లేదని చెప్పారు. సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం కొనసాగిస్తానని తెలిపారు. తాను రాజకీయ కక్షసాధింపునకు గురయ్యానని ఆరోపిస్తూ, ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, సురేంద్ర గాడ్లింగ్ కేసులను ప్రస్తావించారు. 2013 నవంబర్ 7, 8 తేదీల్లో గోవాలో జరిగిన థింక్‌ఫెస్ట్ సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో రెండు సార్లు తనపై అత్యాచారం జరిగిందంటూ బాధితురాలు ఫిర్యాదు చేయగా, అదే ఏడాది నవంబర్‌లో తేజ్‌పాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 13 ఏళ్ల న్యాయపోరాటం అనంతరం హైకోర్టు ఆయనను దోషిగా నిర్ధారించి పదేళ్ల జైలు శిక్ష విధించింది.

# బయోగ్యాస్‌కు కేంద్రం భారీ ఊతం

**రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకానికి కేబినెట్ ఆమోదం**

**అస్సాంలో రూ.8,970 కోట్ల జాతీయ రహదారి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** దేశంలో బయోగ్యాస్ ఉత్పత్తిని విస్తృతంగా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి ఆమోదం లభించింది. ఈ పథకాన్ని 2026-27 నుంచి 2035-36 వరకు అమలు చేయనున్నారు. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ఉత్పత్తి చేయడం ద్వారా దేశీయ బయోగ్యాస్ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర మంత్రులు తెలిపారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ వనరులు లభించడంతో పాటు సేంద్రియ వ్యర్థాల సమర్థ వినియోగానికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. అదే సమావేశంలో అస్సాంలో రూ.8,970 కోట్ల వ్యయంతో నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణానికి కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది.

# అరుణాచల్‌లో భూప్రకంపనలు

**రిక్టర్ స్కేల్‌పై 5.1 తీవ్రత నమోదు**

**ప్రాణ, ఆస్తి నష్టం లేదన్న అధికారులు**




**ఇటానగర్, ఆగస్టు 6:** అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 5.1గా నమోదైనట్లు జాతీయ భూకంప పరిశీలన కేంద్రం (ఎన్‌సీఎస్) వెల్లడించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఉదయం 5.45 గంటలకు అప్పర్ సియాంగ్ జిల్లాలోని పాంగిన్‌కు 116 కిలోమీటర్ల దూరంలో, 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు ఎన్‌సీఎస్ పేర్కొంది. ప్రధాన భూకంపానికి ముందు మూడు స్వల్ప ప్రకంపనలు నమోదయ్యాయని తెలిపింది. ఉదయం 3.40 గంటలకు 2.8 తీవ్రతతో, 3.55 గంటలకు 3.2 తీవ్రతతో, 4.34 గంటలకు మరోసారి 2.8 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు వెల్లడించింది. భూకంపం అనంతరం పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇదే రాష్ట్రంలోని షి యోమి జిల్లాలో బుధవారం కూడా రిక్టర్ స్కేల్‌పై 5.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ జిల్లాకు ఈశాన్యంగా 60 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైనప్పటికీ అక్కడ కూడా ఎలాంటి నష్టం జరగలేదు. ఈశాన్య భారతదేశం భూకంపాలకు అత్యంత సున్నితమైన ప్రాంతంగా గుర్తింపు పొందింది. అందువల్ల ఈ ప్రాంతంలో తరచూ భూప్రకంపనలు సంభవిస్తుంటాయని భూకంప నిపుణులు పేర్కొంటున్నారు.

# అగ్ని-4 క్షిపణి పరీక్ష సక్సెస్

**ఒడిశాలోని చాందీపూర్ నుంచి ప్రయోగం విజయవంతం**

**4,000 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం**




**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ మధ్యంతర శ్రేణికి చెందిన అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్షను భారత్ విజయవంతంగా నిర్వహించింది. ఒడిశాలోని చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి గురువారం నిర్వహించిన ఈ ప్రయోగం విజయవంతమైనట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ (ఎస్‌ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలో క్షిపణి నిర్ణీత లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకుందని, నిర్వహణా, సాంకేతిక ప్రమాణాలన్నింటినీ విజయవంతంగా అందుకుందని రక్షణ శాఖ తెలిపింది. అగ్ని-4 రెండు దశల్లో ప్రయాణించే భూ ఉపరితలం నుంచి భూ ఉపరితలంపైకి ప్రయోగించే మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి. ఘన ఇంధన రాకెట్ మోటార్‌తో పనిచేసే ఈ క్షిపణి సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. భారీ పేలోడ్‌ను మోసుకెళ్లే సామర్థ్యం కూడా దీనికి ఉంది. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో), స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ సంయుక్తంగా అగ్ని శ్రేణి క్షిపణులను అభివృద్ధి చేస్తున్నాయి. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ఉంది. ఇటీవలే డీఆర్‌డీవో దీర్ఘ శ్రేణి గైడెడ్ రాకెట్ పినాకాను విజయవంతంగా పరీక్షించింది. అలాగే ఈ ఏడాది ప్రారంభంలో అగ్ని ప్రైమ్, అగ్ని-3 క్షిపణుల పరీక్షలను కూడా విజయవంతంగా పూర్తి చేసింది. అగ్ని-4 తాజా విజయంతో భారత వ్యూహాత్మక క్షిపణి సామర్థ్యం మరింత బలోపేతమైందని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి.

# జెన్-జీ దేశ వ్యతిరేకులు కాదు

**ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్**



**ముంబై:** జెన్-జీ యువత దేశ వ్యతిరేకులు కాదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమైన వేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. ముంబైలో నిర్వహించిన ఐఐఎమ్‌యూఎన్ సమావేశంలో మోహన్ భాగవత్ పాల్గొన్నారు. అనంతరం జెన్-జీ, జెన్-ఆల్ఫా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. తమ కాలంలో పెద్దల మాటకు ప్రాధాన్యం ఇచ్చేవారమని, అయితే నేటి జెన్-జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. అయితే నిరసనలు చేపట్టేందుకు ప్రజాస్వామ్యంలో కొన్ని పద్ధతులు, నియమాలు ఉంటాయని యువత గుర్తించాలని సూచించారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ చెప్పారు. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా వందకు పైగా నగరాల నుంచి దాదాపు 2 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో బంగారు భవిష్యత్

- కొలనుపాకలో ఆయిల్ ఫామ్ తోటను సందర్శించిన వ్యవసాయ అధికారులు, రైతులు ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోవాలని సూచన

**ఆలేరు, ఆగస్టు 6 :** ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడంలో భాగంగా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతు సొంటెం సోములు, బుజ్జమ్మ, నిర్మల, కల్పనల వ్యవసాయ క్షేత్రాన్ని మండల వ్యవసాయ అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ఆయిల్ ఫామ్ తోటను పరిశీలించి, పండిన గెలలను కోయించారు. పంట సాగు విధానం, నిర్వహణ, దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని సూచించారు. ఆయిల్ ఫామ్ దీర్ఘకాలిక ఆదాయం అందించే లాభదాయకమైన పంట అని పేర్కొన్నారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ ఫామ్‌కు కోతుల బెడద, అడవి పందుల వల్ల నష్టం, వడగండ్ల వాన ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని చెప్పారు. మొక్కలను మొదటి మూడు సంవత్సరాలు శ్రద్ధగా సంరక్షిస్తే మూడో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమై సుమారు 30 సంవత్సరాల వరకు స్థిరమైన ఆదాయం అందుతుందని వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు రైతులకు



దీర్ఘకాలికంగా ఆర్థిక భరోసా కల్పించే పంటగా మారుతోందని, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఈ పంటను సాగు చేయడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చని రైతులకు సూచించారు.ఈ క్షేత్ర సందర్శనలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శివకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైసయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరమల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- ఆలేరులో బూత్ స్థాయి ముగింపు సమావేశం: పాల్గొన్న బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

**ఆలేరు, ఆగస్టు 6 :** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా ఆలేరు పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బూత్ నంబర్లు 180, 181కు సంబంధించిన ప్రత్యేక సవరణ కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) హాజరై ఓటరు జాబితా సవరణ



ప్రక్రియను సమీక్షించారు. సమావేశంలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలపై చేపట్టిన చర్యలను బీఎల్‌వోలు వివరించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతను కాపాడేలా ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించినట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ తరపున ఆలేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిగొండ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకుడు తాళ్లపల్లి మహేష్ సమావేశానికి హాజరై బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో బీఎల్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల బీఎల్ఏలు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**

**నారాయణపేట, ఆగస్టు,06**

నారాయణపేట: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతపరంగా బలమైన పునాది వేసి, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నారాయణపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితమంతా తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి కోసం అంకితం చేశారని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఆయన అందించిన మేధోపరమైన మార్గదర్శకత్వం, నిబద్ధత, త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ కేవలం ఉద్యమకారుడే కాకుండా గొప్ప విద్యావేత్త, ఆలోచనాపరుడు, సమాజ సంస్కర్త అని ఎస్పీ కొనియాడారు. యువత ఆయన నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం, విలువలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. దేశం, రాష్ట్రం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని





ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో DCRB డీఎస్పీ మహేష్, ఆఫీస్ సూపరింటెంట్ శ్యామ్ సుందర్ రాజు,ఎస్సై లు పురుషోత్తం, శ్రీనివాసులు, శ్వేత, శిరీష, వివిధ విభాగాల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# అమ్మపాల చుక్కలోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు...

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శాయంపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం
- చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించిన డాక్టర్ అనితా రెడ్డి

**హన్మకొండ/శాయంపేట, ఆగస్టు 6 :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శాయంపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. శిశువుకు తల్లిపాలే సంపూర్ణమైన, శ్రేష్ఠమైన ఆహారమని, ముఖ్యంగా పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) అత్యంత విలువైనవని చెప్పారు. అవి శిశువుకు రోగనిరోధక శక్తిని



పెంపొందించడంతో పాటు అవసరమైన పోషకాలను అందిస్తాయని, ప్రతి తల్లి తప్పనిసరిగా శిశువుకు ముర్రుపాలు అందేలా చూడాలని సూచించారు.గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆకుకూరలు, ముఖ్యంగా మునగాకు వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తల్లిపాలు ఇస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు.గతంలో ఉమ్మడి కుటుంబాల్లో పెద్దలు తల్లులకు సరైన సూచనలు ఇచ్చేవారని, ప్రస్తుతం చిన్న కుటుంబాల కారణంగా అవగాహన లోపం, జంక్ ఫుడ్ వినియోగం పెరగడం వల్ల తక్కువ బరువుతో, పోషకాహార లోపంతో పిల్లలు జన్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితులను నివారించడంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు నిర్వహించే అవగాహన కార్యక్రమాలు, గృహ సందర్శనల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం ఆహారం తీసుకునే ముందు చేతులను పరిశుభ్రంగా ఎలా కడుక్కోవాలో చిన్నారులకు ప్రదర్శించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల బరువును పరిశీలించి, వారి ఎదుగుదలను అంచనా వేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార లోపం నివారణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఏ చిన్నారి కూడా పోషకాహార లోపంతో బాధపడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజాసంఘాల వినతిపత్రం

- ఇందిరా డెయిరీ ఫామ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కడా అధికారులకు విజ్ఞప్తి

**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,06**

కొడంగల్:తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి (TSMHPS) ఆధ్వర్యంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కి వినతిపత్రం సమర్పించారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరా డెయిరీ ఫామ్' పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన లబ్ధిదారులకు మంజూరైన నిధులను తక్షణమే విడుదల చేయాలని, అలాగే నూతన దరఖాస్తులను స్వీకరించాలని నాయకులు కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కొడంగల్ ప్రాంతంలో నిరుద్యోగ యువత, పేద రైతులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించి తొమ్మిది నెలలు గడుస్తున్నా, ఇంతవరకు నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమకాకపోవడం తీవ్ర ఆందోళనకరమన్నారు. పరిపాలనా అనుమతులు (Proceedings) జారీ చేసి నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్హులైన పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా, ప్రస్తుతం కొత్తగా దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకపోవడంతో నియోజకవర్గంలోని వేలాది మంది అర్హులైన రైతులు, పేదలు పథకం ప్రయోజనాలకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నూతన అప్లికేషన్లను స్వీకరించి, పెండింగ్‌లో ఉన్న నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని కడా అధికారులను



కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు వాహెబ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్, TSMHPS తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాధిఖ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్య, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల హక్కుల సమితి జిల్లా అధ్యక్షులు కే. చంద్రయ్య, డాక్టర్ నవాజ్, మాజీ సర్పంచ్ ఫాహిముద్దీన్, TSMHPS కొడంగల్ పట్టణ అధ్యక్షులు రఫీక్, అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**హైదరాబాద్, ఆగస్టు 6 :** తెలంగాణ ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు ఆహార భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త లామినేటెడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఈ కార్యక్రమాన్ని సంగారెడ్డిలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ చేపట్టనున్నారు.ఆహార & పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక మెమో జారీ చేస్తూ, కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పకడ్బందీగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాల ఖరారు, కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పేద కుటుంబాలందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

## బీపీ మిషన్ స్టెతస్కోప్ అందజేత.



**వలిగొండ ఆగస్టు 06**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజుపల్లి గ్రామం స్థానిక ఉప సర్పంచ్ పోలబోయిన లింగస్వామి తన సొంత ఖర్చులతో స్థానిక సర్పంచ్ సలిగంజి పృథ్వి చేతుల మీదగా బీపీ మిషన్ స్టెతస్కోప్ స్థానిక ఆశా కార్యకర్త నీలం నీరజ కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవనీత ఉపాధ్యాయులు రేవతి అంగన్వాడి టీచర్ ఎన్ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి.



**వలిగొండ ఆగస్టు 06**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్క ఉద్యమకారుడు ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం సీనియర్ నాయకులు చిలుగూరి సత్తిరెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, బొడిగెసుదర్శన్,కన్నె కంటి శ్రీనివాసచారి, ఐటి పాముల పుష్ప, కొండూరు సత్తయ్య, దండ మల్లికార్జున్, పల్లెర్ల రామచందర్, ఉక్కుర్తి యాదగిరి, పారుపల్లి నరసింహ, వనం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్–కార్యక్రమం 100% పూర్తి.డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్.



**కొడంగల్ మున్సిపల్(మం)ఆగస్టు,06**

మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్మన్ & కొడంగల్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్ తో కలసి వివరాలు వెల్లడించిన డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్.కొడంగల్ నియోజకవర్గంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన Special Intensive Revision (SIR) కార్యక్రమం విజయవంతంగా 100% పూర్తి చేస్తాం.ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన

- బూత్ లెవెల్ ఆఫీసర్లు (BLOs)
- బూత్ లెవెల్ ఏజెంట్లు (BLAs)
- పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు
- నియోజకవర్గ ప్రజలు

అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అన్నారు.ప్రత్యేకంగా, ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో అంకితభావంతో పనిచేసిన సిబ్బంది వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామనీ కృతజ్ఞత పరిచారు. ఇకముందు కూడా ఓటరు హక్కులను పరిరక్షిస్తూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరుతున్నామనీ తెలిపారు...

# ఆంజనేయ స్వామి ఆలయానికి సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన

## ముున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్






**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,06**

కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సిద్ధనొంపు పడమటి ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు పనులను కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందరం ప్రశాంత్ ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా రహదారి సౌకర్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఈ పనులు చేపట్టారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ హిందువాహిని యువకుల బృందం, కొడంగల్ వాసులు పాల్గొని రోడ్డు పనుల ప్రారంభాన్ని స్వాగతించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం చేపడుతున్న పనులకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# కోస్గి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రఘువర్ధన్ రెడ్డి రెండవసారి నియామకం



**కోస్గి మండలం, ఆగస్టు,06**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి. మరియు కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతిరెడ్డి కోస్గి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రెండవసారి రఘువర్ధన్ రెడ్డిని నియమించడం జరిగింది.అందుకుగాను కోస్గి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రెండోసారి ఎన్నికైన రఘువరన్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన కోస్గి కో అప్షన్ మెంబర్ ఎస్.ఏ. సలీమ్

# కలెక్టరేట్ లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**నారాయణపేట, ఆగస్టు,06**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆలోచనలు, రచనలు, పరిశోధనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, ఏవో అనిల్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీఆర్‌వో రషీద్, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆకులను తొలగించాలని బిజెపి డిమాండ్.



**వలిగొండ ఆగస్టు 06**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో వలిగొండ చెరువు నుండి కాలువల ద్వారా వెల్వర్తి తదితర గ్రామాలకు వెళ్లే సాగునీటి కాలువలు సందర్శించడం జరిగింది. వారు మాట్లాడుతూ సాగునీటి కాలువల్లో గుర్రపు డెక్కహాకు పేర్కొపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం ద్వారా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కాకులను తీసివేయించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులతో కలిసి కాలువలు వద్దనే భారతీయ జనతా పార్టీ ధర్నా కార్యక్రమాన్ని చేపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామనర్స్, జిల్లా నాయకులు మైసొల్ల మచ్చగిరి, బచ్చు శ్రీనివాస్, ఆనంద్, మండల పదాధికారులు నాగరాజు, దయాకర్, వెంకటేశం నాయకులు పెద్ద కిట్టు, నరేష్, మురళి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధికి యువతే చోదకశక్తి

- బహదూర్‌పేటలో యువజన అభివృద్ధి కార్యక్రమం: ప్రభుత్వ పథకాలపై అవగాహన



**ఆలేరు, ఆగస్టు 6** : సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఆలేరు మండల యువజన సంఘాల సమితి అధ్యక్షుడు తాళ్లపల్లి మహేష్ అన్నారు. గురువారం ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని బహదూర్‌పేటలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మేరా భారత్ కేంద్ర, తెలంగాణ యాదాద్రి భువనగిరి జిల్లా నిర్వహించిన యువజన అభివృద్ధి (యూత్ డెవలప్‌మెంట్) కార్యక్రమంలో ఆయన పాల్గొని యువతకు ప్రభుత్వ సంక్షేమ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను తొలగించడంలో యువత ముందుండాలని, విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సేవ తదితర రంగాల్లో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం యువత కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జంపాల శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడంలో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. సామాజిక బాధ్యతతో పనిచేస్తూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ బహదూర్‌పేట అధ్యక్షుడు దొంతుల ఎల్లేష్, జనరల్ సెక్రటరీ కుండే సంపత్, యూత్ సభ్యులు కుల్ల సిద్ధులు, పల్లె మహేష్, రాములు, సంగి నాగరాజు, వస్పరి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అస్తిత్వానికి చిరునామా ప్రొఫెసర్ జయశంకర్...

- స్వరాష్ట్ర సాధనకు జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు
- నర్సంపేటలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకలు

**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 6** : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సిద్ధాంతకర్త, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మల్లంపల్లి రోడ్డులో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచి, తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రపంచానికి చాటిన మహామేధావి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగం, కృషి, సిద్ధాంతపరమైన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను రగిలించి, ఉద్యమానికి సైద్ధాంతిక బలం చేకూర్చిన మహనీయుడు జయశంకర్ అని అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్నే అంకితం చేసి, స్వరాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసిన మహోన్నత వ్యక్తిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలు, విలువలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీరామోజ్ రోజారాణి, కాంపెల్లి వీణ–విజేందర్ రెడ్డి, బీరం భరత్ రెడ్డి, పొన్నాల మనీష్ ప్రకాశ్, బాణాల ప్రసన్న శ్రీనివాస్, దొంగల రజిత–సురేష్,



మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం, అఖిల భారత విశ్వకర్మ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదర్శన చారి, గౌరవ అధ్యక్షుడు కేసోజు రావన్న, మొగలోజు కోటిలింగాచారి, శ్రీపెల్లి రవి, భద్రయ్య, రవీందర్, వద్యాలపు నరేష్, కాసుల యుగంధర్, పబోజు సత్యనారాయణ, కాసుల లింగాచారి, దేవోజు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ దిక్సూచి జయశంకర్..

- స్వరాష్ట్ర పోరాటానికి చిరస్మరణీయుడు పెద్ది సుదర్శన్ రెడ్డి
- బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రొజయశంకర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి జయంతి వేడుకలు
- తెలంగాణ ఉద్యమంలో ఇద్దరి సేవలు భావితరాలకు స్ఫూర్తి...బీఆరెస్ నాయకులు

**హన్మకొండ, ఆగస్టు 6** : తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ దిక్సూచి ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, తెలంగాణ ఉద్యమ యోధుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి జయంతి వేడుకలను బీఆర్ఎస్ పార్టీ బాలసముద్రం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు.విద్యార్థి ఉద్యమ నాయకుడు బైరపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి




ఆచార్య జయశంకర్ దిక్సూచిగా నిలిచి ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వానికి బలమైన మేధోబలాన్ని అందించిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, తెలంగాణ ఉన్నంతకాలం జయశంకర్ పేరు చిరస్మరణీయంగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం జయశంకర్ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆయన పేరును విశ్వవిద్యాలయానికి పెట్టడం ఆయన పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపిన గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు.అనంతరం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, ఉడతల సారంగపాణి, పులి రజనీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పోరాట యోధుడని కొనియాడారు. ఓరుగల్లు కేంద్రంగా తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో ఆయన విశేష కృషి చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ, సబ్బండ వర్గాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, సంకు నర్సింగరావు, చెన్నం మధు, మేకల బాబురావు, నాయకులు పోలపెల్లి రామ్మూర్తి, సల్వాజీ రవీందర్ రావు, ఎస్.కే. మహమూద్, గండ్రకోట రాకేష్ యాదవ్, గొర్రె విజయ్, విజయ్ రెడ్డి, సదాంత్, సురాసి మహేష్, సౌరం రఘు, తాళ్లపెల్లి రమేష్, చందు, పుల్లయ్య, ప్రసాద్, పబ్బోజు శ్రీకాంతాచారి, బరిగెల వినయ్, మూటిక రాజు యాదవ్, తక్కళ్లపల్లి వినీల్ రావు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభ ఘనంగా నిర్వహించాలి

- ఈ నెల 9న నల్లబెల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శ
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు

**నల్లబెల్లి/వరంగల్, ఆగస్టు 6** : దివంగత తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కర్మ సందర్భంగా ఈ నెల 9న నిర్వహించనున్న సంస్మరణ సభ ఏర్పాట్లను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్ల ధర్మారెడ్డి, ఆరూరి రమేష్, మాజీ చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి, రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు.నల్లబెల్లి మండలంలోని పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి చేరుకున్న నాయకులు, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. సభా వేదిక, పార్కింగ్, తాగునీరు, భోజన వసతి, ప్రజల రాకపోకలు, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలపై పార్టీ నాయకులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం స్థానిక నాయకులతో సమావేశమైన వారు, పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిలో అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. సంస్మరణ సభను ఆయనకు తగిన స్థాయిలో నిర్వహించి, ఉద్యమ నాయకుడిగా ఆయన సేవలను భావితరాలకు చాటేలా విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల



చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నల్లబెల్లికి చేరుకుని స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్లు నాయకులు తెలిపారు. అనంతరం నిర్వహించే సంస్మరణ సభలో పాల్గొని ఆయనకు నివాళులర్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు,

# విజయవంతమైన ఉచిత నేత్ర వైద్య శిబిరం..

## నేత్ర వైద్యులు భాస్కర్ గౌడ్

**కోస్గి మున్సిపల్ (మం)ఆగస్టు,06**

**కోస్గి:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించినట్లు నేత్ర వైద్యులు భాస్కర్ గౌడ్ తెలిపారు.గురువారం కోస్గి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరానికి మండల పరిధిలోని సుమారు 40 మందికి కంటి పరీక్షలు




నిర్వహించగా వారిలో 30 మందికి కంటి శుక్లాల లోపాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. వీరికి ఉచిత ఆపరేషన్ల కొరకు పాలమూరులో కందూరి రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించి ఉచిత చికిత్సలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోస్గి లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ మహేందర్ గౌడ్, మాజీ అధ్యక్షులు పూర్ణచంద్ర యాదవ్, సెక్రటరీ బెజ్జు వెంకట్రాములు, వెన్న శేఖర్ తదితరులు పాల్గొన్నారు..

# స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష

- తెలంగాణ కోసం చివరి శ్వాస వరకు తపించిన జయశంకర్ సార్
- కేసీఆర్ పట్టుదలపై సంపూర్ణ విశ్వాసంతో వెన్నంటి నిలిచారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఘన నివాళులు



**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పనిచేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు మించిన దక్షత, నిబద్ధత, తెలంగాణ సాధించాలనే పట్టుదల ఉన్న నాయకుడిని చూపిస్తే ఆయన వెంట నడుస్తానని జయశంకర్ సార్ బహిరంగంగానే చెప్పేవారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ సాధన లక్ష్యంగా ఏర్పడిన ఇతర రాజకీయ పార్టీల విషయంలోనూ విభేదాలు కాకుండా లక్ష్యసారూప్యత ఉండాలని ఆయన ఎప్పుడూ సూచించేవారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్ని కొత్త పార్టీలు వచ్చినా, అందరి లక్ష్యం తెలంగాణ రాష్ట్ర సాధనే కావాలని జయశంకర్ సార్ ఆకాంక్షించారని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమ శక్తులు పరస్పరం కలహించకుండా సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించేవారని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ నీటి హక్కులకు మళ్లీ ముప్పు ఏర్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణకు సంబంధించిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కేంద్రాన్ని కోరుతోందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా స్పందించడం లేదని విమర్శించారు. తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదా అని ప్రశ్నించారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోల్చిన వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎవరూ స్పందించలేదని, బీఆర్ఎస్ ప్రతినిధులు ఉంటే గట్టిగా నిలదీసేవారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తుండడాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణ నాయకత్వం ఢిల్లీపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఉండాలని జయశంకర్ సార్ ఎప్పుడూ కోరుకున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే నిజమైన రక్షణ అని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా గళమెత్తే నాయకత్వం అవసరమని జయశంకర్ సార్ విశ్వసించారని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ తరహా ధైర్యవంతమైన నాయకత్వమే అవసరమని, అదే జయశంకర్ సార్ ఆకాంక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.

# గోదావరి ప్రాజెక్టులకు సమాధి కట్టే కుట్ర

- ఏపీ డైరెక్షన్‌లో జీఆర్ఎంబీ నడుస్తోంది
- 'జై తెలంగాణ' అనని వ్యక్తి సీఎంగా ఉన్నారు: హరీశ్‌రావు
- జయశంకర్ ఆరాటం.. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధ్యమైందని వ్యాఖ్య



**సిద్దిపేట, ఆగస్టు 6:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) ఆంధ్రప్రదేశ్ డైరెక్షన్‌లో పనిచేస్తోందని, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా చూస్తోందని విమర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని, "జై తెలంగాణ" అని ఎప్పుడూ పలకని వ్యక్తి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ప్రొఫెసర్ జయశంకర్ ఆరాటం, కేసీఆర్ పోరాటమే ప్రధాన కారణమని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గోదావరి జలాల్లో 380 టీఎంసీల నీటిని తెలంగాణ హక్కుగా సాధించామని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమానికి నీటి హక్కులే ప్రధాన ప్రేరణగా నిలిచాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు సాధించలేకపోయిందని ఆయన విమర్శించారు. గతంలో జీఆర్ఎంబీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలను తిప్పికొట్టి తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చామని, ఇప్పుడు ఇప్పటికే అనుమతులు పొందిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి పునఃసమీక్షించాలనే అంశాన్ని అజెండాలో చేర్చడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీటి హక్కులపై చిత్తశుద్ధి ఉంటే జీఆర్ఎంబీ అజెండాను వెంటనే మార్చించాలని, అవసరమైతే ఆ సమావేశాన్ని బహిష్కరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీ అనుమతులు వచ్చినప్పటికీ ప్రభుత్వం దానిని ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని నిలదీశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ రెండో దశకు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు నీరు కీలకమని పేర్కొన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. మొదట జీఆర్ఎంబీ అజెండాలో లేదని చెప్పి, తర్వాత ఢిల్లీలో జరిగిన సమావేశంలో చేర్చి, సమావేశానికి వెళ్లమని చెప్పి చివరకు సంతకాలు చేశారని విమర్శించారు. కోర్టుల్లో ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యాల నిర్వహణ కూడా పూర్తిగా విఫలమైందని, కనీసం రిట్ పిటిషన్‌ను సక్రమంగా నిర్వహించే సామర్థ్యం కూడా ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు.

# సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**హైదరాబాద్, ఆగస్ట్ 6:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని



దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.





# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

## గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణ సిద్ధాంతకర్త, స్వర్గీయ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సభలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మంత్రి హాజహరుద్దీన్ పాల్గొన్నారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఆవశ్యకతను విద్యార్థులకు, ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించి ఉద్యమానికి దిశానిర్దేశం చేశారని చెప్పారు. అలాగే, జయశంకర్ ఆశయాలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరాల్సి ఉందని పేర్కొంటూ, హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ నేతలు తమ రాజధాని అమరావతిలో స్థిరపడితేనే జయశంకర్ కోరుకున్న తెలంగాణ పూర్తిస్థాయిలో సాకారమైనట్లుగా భావిస్తామని వ్యాఖ్యానించారు. జయశంకర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత తమ జీవిత లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.



# కేటీఆర్‌తో అంబేద్కర్ మనవడి భేటీ

**హైదరాబాద్, ఆగస్ట్ 6:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో వంచిత్ బహుజన్ అగాడీ అధినేత ప్రకాష్ అంబేద్కర్ గురువారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ బంజారాహిల్స్ లోని నివాసంలో కేటీఆర్‌తో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, పార్టీ నాయకులను కేటీఆర్ పరిచయం చేశారు. భేటీ అనంతరం ప్రకాష్ అంబేద్కర్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు దేశంలో తొలి స్థానం




**హైదరాబాద్, ఆగస్టు 6 :** సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన సేవలందించడంలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలిచినట్లు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షిఖా గోయల్ తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయం నిర్వహించిన 'ప్రగతి' సమీక్షలో కేంద్ర హోంశాఖ పరిధిలోని డిజిటల్ సైబర్ వ్యవస్థల వినియోగం, పనితీరు ఆధారంగా తెలంగాణకు ఈ గుర్తింపు లభించినట్లు వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర సైబర్ నేరాల సమన్వయ కేంద్రం ఏర్పాటు, డిజిటల్ జీరో ఎఫ్ఐఆర్ అమలు, ఫిర్యాదుల పరిష్కారం, మనీ రెస్టోరేషన్, 'సహాయోగ్' వేదిక, అంతర్రాష్ట్ర సమన్వయం, సైబర్ హాట్‌స్పాట్ల గుర్తింపు, అధికారులకు శిక్షణ, ప్రజల్లో అవగాహన కల్పన వంటి తొమ్మిది కీలక అంశాల్లో రాష్ట్రం అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు కేంద్రం ప్రశంసించింది. ఆగస్టు 2 నాటికి ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 2,368 దరఖాస్తుల్లో 2,086 పరిష్కరించి 88 శాతం విజయాన్ని నమోదు చేసింది. మనీ రెస్టోరేషన్ వేదిక ద్వారా రూ.16.42 కోట్ల మేర బాధితులకు తిరిగి అందించే ప్రక్రియ కొనసాగుతుండగా, 28,097 ఉత్తర్వులు జారీ అయ్యాయి. 'సహాయోగ్' వేదికలో 22,447 అనుచిత వెబ్ లింకుల్లో 20,070 తొలగించి 89.41 శాతం విజయాన్ని సాధించింది. అంతర్రాష్ట్ర సమన్వయ వేదికలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల్లో 96.68 శాతం పూర్తి చేసింది. బాధితుల సహాయార్థం ప్రత్యేక హెల్ప్‌లైన్ 8712665600ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు షిఖా గోయల్ తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఫిర్యాదు నమోదు చేసి, అందుబాటులో ఉన్న డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

# 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు

**హైదరాబాద్ పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోంది**

**జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**

**మరో రెండేళ్లలో 1,600 మందికి ఉపాధి**

**హైదరాబాద్, ఆగస్టు 6 :** గత 20 నెలల్లో తెలంగాణలో 150 కొత్త గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ఏర్పాటై, వాటి ద్వారా సుమారు 1.5 లక్షల మందికి ఉపాధి కల్పించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ (జోన్స్ లాంగ్ లాసెల్) సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన నగరాలను గుర్తించే జేఎల్ఎల్ వంటి అంతర్జాతీయ సంస్థ హైదరాబాద్‌ను తన జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం తెలంగాణపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. సంప్రదాయ ఐటీ సేవల కంటే ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్ ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయని చెప్పారు. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వంటి సాంకేతిక మార్పులు వచ్చినా జీసీసీల ప్రాధాన్యం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, 2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతానికి చేరుకోగా, నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతంగా నమోదైంది. ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాలకు చెందిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు కూడా హైదరాబాద్ తొలి ఎంపికగా నిలుస్తోందని చెప్పారు. జేఎల్ఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉపాధి లభించనుందని మంత్రి తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, సాంకేతిక సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎల్ఎల్ కార్యకలాపాలకు అందించనున్నారు.



## ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్‌కు బీఆర్ఎస్ యువజన నాయకుల సన్మానం



**ఆలేరు, ఆగస్టు 6:** ఆలేరు పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా బాధ్యతలు స్వీకరించిన జి ఉదయ్ కిరణ్‌ను గురువారం బీఆర్ఎస్ యువజన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు పూల శ్రావణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, కౌన్సిలర్ యాట శివ, సెక్రటరీ జనరల్ కుండే సంపత్ పాల్గొని నూతన ఎస్‌హెచ్‌ఓకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలేరు పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిక్షమన్నా యువసేన అధ్యక్షుడు గోరెమియా, మంగ అరవింద్, ఎల్లేష్, మహమూద్, ఫయాజ్, ఎలుగల హరికృష్ణ, చందు, మొగిలిపాక కృష్ణ, పల్లె మహేష్, సంగి నాగరాజు, సుకృత్, ఎలుగల నరేష్, పూల కళ్యాణ్, టీంకు, నవీన్, చింతకాయల అనిల్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు



**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,06**

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా గురువారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాసాని వెంకటయ్య. కిషన్ నాయక్. రమేష్ నాయక్ మంగలి శేఖర్. కటిక మహేష్ వెంకటయ్య. అంబేద్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారం...

- పెండెం శ్రీలక్ష్మీరామానంద్
- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నర్సంపేట అంగన్వాడీలో అన్నప్రాసన
- ముర్రుపాలపై అపోహలు వీడి.. తొలి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలి: సీడీపీవో మధురిమ



**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 6** : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నర్సంపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని ఐకేపీ–మెప్మా కార్యాలయంలో గురువారం అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నర్సంపేట ప్రాజెక్టు సీడీపీవో మధురిమ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు తల్లుల్లో అవగాహన పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. గర్భిణులు సమతుల్య, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వడంతో పాటు తగినంత తల్లిపాలు అందించగలరని తెలిపారు.శిశువు జన్మించిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) అత్యంత విలువైనవని, వాటిని తప్పనిసరిగా బిడ్డకు పట్టించాలని సూచించారు. పుట్టిన తర్వాత తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు తప్ప ఇతర ద్రవాలు, ఆహార పదార్థాలు ఇవ్వకూడదని, తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారమని పేర్కొన్నారు.సీడీపీవో మధురిమ మాట్లాడుతూ, ముర్రుపాలపై ఉన్న అపోహలను పూర్తిగా వీడాలని, కల్తీలేని స్వచ్ఛమైన తల్లిపాలను క్రమం తప్పకుండా శిశువుకు అందించాలని సూచించారు. డబ్బాపాలపై ఆధారపడకుండా తల్లిపాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, ఉద్యోగం లేదా ఇతర పనుల ఒత్తిడి కారణంగా ఏ తల్లి కూడా తన బిడ్డ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. శిశువు శారీరక, మానసిక ఎదుగుదలలో తల్లి పాత్ర అత్యంత కీలకమన్నారు.అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్, సీడీపీవో, కౌన్సిలర్లు చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించి తల్లులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, సీడీపీవో మధురిమ, కౌన్సిలర్లు శ్రీరామోజు రోజారాణి, బాణాల ప్రసన్న, పొన్నాల మనీషా, వీణ, దొంగల రజిత, సూపర్‌వైజర్లు అరుణ, వాసంతి, అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్‌కు ఘన నివాళులు

- ఘనంగా నివాళులు తెలియజేసిన రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ ఉపాధిహామీ కౌన్సిల్ రాష్ట్రం మెంబర్ నరసింహులు గౌడ్





**బొంరస్ పేట,మండలం, ఆగస్టు,06**

తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రం (ఎంఆర్సీ) మరియు మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ పాల్గొని.. జిల్లా కార్యదర్శులు రవీందర్ గౌడ్, భాకారం చంద్రశేఖర్, పల్నాటి అనిల్ కుమార్, జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ గౌరారం గోపాల్, పాత్రికేయులు మాట్లాడుతూ, తెలంగాణ విద్యావంతుల వేదిక అనే మేధావుల వేదికను ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమ భావజాలాన్ని సమాజానికి చేరవేయడంలో, తెలంగాణ ఉద్యమకారులను, మేధావులను ప్రజలకు పరిచయం చేయడంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విశిష్ట పాత్ర పోషించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు భాకారం పాత్రికేయులు ఈనాడు నర్సింలు ఆంధ్రజ్యోతి అంజయ్య ఎంఆర్సి సిబ్బంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు . తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా, దార్శనికుడిగా, విద్యావేత్తగా, ఉద్యమ స్ఫూర్తిగా జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి అని, యువత ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు,ఉపాధ్యాయులు, పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు,

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి

- జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

**ఆలేరు, ఆగస్టు 6** : తెలంగాణ ఆవిర్భావ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కె జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆలేరు పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ఆవిర్భావానికి ఆయన చూపిన మార్గం, చేసిన మేధోపోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడిగా జయశంకర్ సార్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఆయన ఆశయాల సాధనే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యాట శివ, బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కుండే సంపత్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు పూల శ్రావణ్, బిక్షమన్నా



యువసేన అధ్యక్షుడు గోరెమియా, మంగ అరవింద్, ఎల్లేష్, మహమూద్, ఫయాజ్, ఎలుగల హరికృష్ణ, చందు, మొగిలిపాక కృష్ణ, పల్లె మహేష్, సంగి నాగరాజు, సుకృత్, ఎలుగల నరేష్, పూల కళ్యాణ్, టీంకు, నవీన్, చింతకాయల అనిల్, బన్నీ తదితరులు పాల్గొని ప్రొఫెసర్

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలి

**మామిడాల భిక్షపతి**

**ఆలేరు, ఆగస్టు 6** : మంచిర్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను రైతులు, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి పిలుపునిచ్చారు.యాదాద్రి భువనగిరి జిల్లా ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం ఆలేరులో జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మామిడాల భిక్షపతి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్ తదితర సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినా పంటకు సరైన ధర లభించడం లేదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు లేకపోవడం, రుణభారం పెరగడం, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతుండడం ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ కూలీల




పరిస్థితి కూడా దయనీయంగా మారిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, ఉపాధి హామీ చట్టాన్ని సమర్థంగా అమలు చేయకపోవడం, కనీస వేతనాలు అమలు కాకపోవడం వల్ల కూలీలు జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భూమిలేని పేదలకు సాగుభూమి పంపిణీ చేయాలని, వ్యవసాయ కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలని, కనీస వేతనాల అమలును ప్రభుత్వం కచ్చితంగా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. అమెరికాతో సహా ఇతర దేశాలతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకుంటున్న వ్యవసాయ సంబంధిత విదేశీ వాణిజ్య ఒప్పందాలు దేశీయ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందని మామిడాల భిక్షపతి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందాల వల్ల విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరిగి దేశీయ రైతులు పండించిన పంటలకు మార్కెట్ దెబ్బతింటుందని, గిట్టుబాటు ధరలు మరింత తగ్గే అవకాశం ఉందన్నారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే ఇటువంటి విధానాలను వెంటనే ఉపసంహరించుకొని, దేశీయ రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలో జరిగే రాష్ట్ర 9వ మహాసభల్లో రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరల సాధన, రుణమాఫీ, కౌలు రైతుల హక్కులు, భూమిలేని పేదలకు భూమి పంపిణీ, వ్యవసాయ కూలీల సమస్యలు, ఉపాధి హామీ చట్టం సమర్థ అమలు, సాగునీటి సమస్యలు, రైతు, కూలీ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన ఉద్యమాలపై కీలక తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, ఉపాధ్యక్షులు చిరబోయిన రాజయ్య, ఇక్కిరి సహదేవ్, మామిడాల బాలమల్లేశ్, మందడి అమరేందర్ రెడ్డి, చిరబోయిన కొమురయ్య, రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు

**టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు**

**నారాయణపేట, ఆగస్టు,06**

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు జిల్లాలో డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా నారాయణపేట పట్టణంలో టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ బృందంతో కలిసి ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నిఫర్ పోలీసు జాగిలం "విక్కి" సహాయంతో బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, రెస్టారెంట్లు మరియు అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు.డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ సమాజాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని అన్నారు.ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా డయల్–100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## 10న జరిగే జైల్ బరోను జయప్రదం చేయండి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్

**కొడంగల్, మున్సిపల్, ఆగస్టు,06**

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తున్నందున రైతు సంఘం, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10న దేశ వ్యాప్తంగా జైల్ బరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ తెలిపారు. గురువారం కోడంగల్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతు.. ప్రధానంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులకు నష్టం కలిగించే విధంగా 8 గంటల పనిని 12 గంటల వరకు పెంచుకునేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం స్థానంలో విబి జి రాంజీ పథకం తీసుకొచ్చి ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచారన్నారు.రైతులకు నష్టం కలిగించే విధంగా నూతన విద్యుత్ చట్టం, విత్తన సవరణ చట్టం తీసుకొచ్చారని దీనివల్ల రైతులకే కాకుండా వినియోగదారులకు కూడా నష్టం కలుగుతుందని తెలిపారు. అందుకని ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నందున వాటిని ఉపసంహరించుకోవాలని తెలియజేస్తూ రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున జైల్ బరో నిరసన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయాల సాధనకు కృషి చేయాలి...

- ప్రొఫెసర్ జయశంకర్, పెద్ది సుదర్శన్ రెడ్డి జయంతి సందర్భంగా ఘన నివాళులు
- పెద్ది విగ్రహ ఏర్పాటుకు భూమిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్
- పెద్ది చూపిన బాటలోనే ముందుకు సాగాలి
- కార్యకర్తలకు నన్నపనేని పిలుపు



**నర్సంపేట/నల్లబెల్లి, ఆగస్టు 6 :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి, తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి జయంతి సందర్భంగా వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన ప్రజానాయకుడని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయనను స్మరించు కున్నారు.పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ ఉద్యమానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోవడం కష్టమే అయినప్పటికీ, కార్యకర్తలు అధైర్యప డకుండా ఆయన ఆశయాల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి పల్లె, మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమంతా ఉద్యమానికే అంకితమైందని, ప్రజలనే తన కుటుంబంగా భావించి సేవలందించారని పేర్కొన్నారు. నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు, నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తాను 2009 నుంచి దాదాపు 17 సంవత్సరాల పాటు పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.ఈ నెల నిర్వహించనున్న పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నన్నపనేని నరేందర్ కోరారు.అనంతరం నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట ఏర్పాటు చేయనున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి జ్ఞాపకార్థం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించే అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఆయన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి నర్సంపేటకు ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. అదే కళాశాల ముందు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆయనకు నిజమైన నివాళిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విగ్రహ ఏర్పాటుకు ముందుకొచ్చిన డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కళ్లపల్లి రవీందర్ రావు, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ నాడెం శాంతికుమార్, క్లస్టర్ బాధ్యులు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ అభ్యర్థులు, మహిళా విభాగం నాయకులు, పట్టణ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గీతన్నల చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

- కల్లుగీత కార్మిక సంఘం
- మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఆలేరు, ఆగస్టు 6 :** కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం, వృత్తిలో భద్రత, సంక్షేమం, ఉపాధి అవకాశాల విస్తరణ, వృత్తి ఆధునీకరణ కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కల్లుగీత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆగస్టు 2న మహబూబాబాద్ (మానుకోట) నుంచి హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వరకు చేపట్టిన గీతన్నల చైతన్య యాత్ర ఈ నెల 9న ఆలేరు పట్టణానికి చేరుకోనున్న నేపథ్యంలో, యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఆలేరులో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీతా కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. గీతా కార్మికులకు నెలకు రూ.4 వేల పెన్షన్ అందించడంతో పాటు, ప్రమాదాల్లో మృతి చెందిన లేదా తీవ్రంగా గాయపడిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచి, ప్రమాదం జరిగిన ప్రతి సందర్భంలో వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవో ప్రకారం 50 సంవత్సరాలు నిండిన అర్హులైన గీతా కార్మికులందరికీ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే బాధిత కుటుంబాలకు విడుదల చేయాలని, రాష్ట్రంలో ఉన్న సుమారు కోటి తాటి, ఈత చెట్లకు సంఖ్యలు కేటాయించి వాటిని సంరక్షించే చర్యలు చేపట్టాలని, అక్రమంగా చెట్లను నరికివేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రతి కల్లుగీత సహకార సంఘానికి ఐదు ఎకరాల భూమి కేటాయించి సాగునీటి సౌకర్యం కల్పించాలని, పొట్టి తాటి, ఈత, ఖర్జూర మొక్కలను విస్తృతంగా నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. వృత్తిలో ఉన్న ప్రతి కార్మికుడికి కాటమయ్య రక్షణ కవచం అందించడంతో పాటు, రాష్ట్ర బడ్జెట్‌లో నీరా అభివృద్ధికి రూ.25 కోట్లు, గీతా కార్మికుల సంక్షేమానికి రూ.67 కోట్లు కేటాయించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నీరా ప్లాంట్ల



ఏర్పాటు, ఏజెన్సీ ప్రాంతాల్లో గీతా కార్మికులకు సభ్యత్వాలు కల్పించి సహకార సంఘాల ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, సర్వాయిపేట, తాటికొండ, ఖిలాషాపురం కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం మండల కన్వీనర్ కోరుకొప్పుల కిష్టయ్య, రాష్ట్ర నాయకుడు మొరిగాడు చంద్రశేఖర్, జిల్లా నాయకుడు మొరిగాడి రమేష్, మండల నాయకులు మిట్ట

# ప్రొఫెసర్ జయశంకర్ గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



**వికారాబాద్, ఆగస్టు,06**

తెలంగాణా సిద్ధాంత కర్తగా పేరు పొందిన ప్రొఫెసర్ జయశంకర్ గారి ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.గురువారం కాల్లెక్ట్రేట్ కార్యాలయ సమావేశము హాలు నందు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ మరియు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్ లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయ శంకర్ జయంతి వేడుకలు పురస్కరించుకొని వారి యొక్క సేవలను కొనియాడారు.తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ బాషలలో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణా ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. తెలంగాణా ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని , తెలంగాణా ఉద్యమ సిదంతా కర్త అని వారి ఉద్యమ స్పర్తిని, సేవలను కొనియాడారు.జయశంకర్ కలలుగన్న తెలంగాణ మనకు సిద్ధించిందని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ స్వర్ణలత,వెనుకబడిన తరగతుల అబివృద్ధి అధికారి మాధవ రెడ్డి, జయపాల్ రెడ్డి,శ్రీధర్

# జయశంకర్ జయంతిని అధికారిక సెలవు దినంగా ప్రకటించాలి...

- దేవోజు సదానందం
- తెలంగాణ ఉద్యమంలో విశ్వకర్మల త్యాగాలను గుర్తించాలి
- విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్, చేతివృత్తిదారులకు పించన్ కల్పించాలని విజ్ఞప్తి

**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 6 :** తెలంగాణ ఉద్యమ శిఖరం, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా నర్సంపేట పట్టణంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సంపేట పట్టణ విశ్వకర్మ మాజీ అధ్యక్షుడు దేవోజు సదానందం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఐదు దశాబ్దాలకు పైగా సాగిన ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేసిన మహామేధావి జయశంకర్ అని పేర్కొన్నారు. తెలంగాణపై జరిగిన అన్యాయాలు, వివక్ష, దోపిడీకి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన మహనీయుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.తెలంగాణ తొలి దశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన విశ్వకర్మ వర్గానికి చెందిన మారోజు వీరన్న సేవలను స్మరించుకున్నారు. అలాగే మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను అర్పించిన కాసోజు శ్రీకాంతాచారి, తొగరు రాజ్‌కుమార్ త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.విశ్వకర్మల త్యాగాలు తెలంగాణ ఉద్యమంలో కీలకమైనప్పటికీ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు విశ్వకర్మలను రాజకీయ అవసరాల కోసం వినియోగించుకున్నప్పటికీ, వారి అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ప్రొఫెసర్ జయశంకర్ పేరును రాజకీయ సభల్లో ప్రస్తావించినప్పటికీ, ఆయన జయంతి లేదా వర్ధంతిని అధికారిక సెలవు దినంగా ప్రకటించలేదని పేర్కొన్నారు. కనీసం ఇప్పుడు అయినా కాంగ్రెస్ ప్రభుత్వం జయశంకర్ జయంతి లేదా వర్ధంతిని అధికారిక సెలవు దినంగా ప్రకటించి ఆయనకు తగిన గౌరవం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.విశ్వకర్మల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు చేతివృత్తిదారులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు. అలాగే 50 సంవత్సరాలు నిండిన ప్రతి విశ్వకర్మ చేతివృత్తిదారునికి పింఛన్ మంజూరు చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల కమిటీల్లో విశ్వకర్మలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని



కోరారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత విశ్వకర్మ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురిమిళ్ల సుదర్శన చారి, గౌరవ అధ్యక్షుడు కేసోజు రావన్న, మొగలోజు కోటిలింగాచారి, శ్రీపెల్లి రవి, భద్రయ్య, రవీందర్, వడ్యాలపు నరేష్, కాసుల యుగంధర్, పబ్బోజు సత్యనారాయణ, కాసుల లింగాచారి, దేవోజు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొ" జయశంకర్ జయంతి సందర్భంగా నివాళులు..

**రోడ్డు విస్తరణలో బాధితులకు చెక్కుల పంపిణీ**



**కొడంగల్ మున్సిపాలిటీ, ఆగస్టు,06**

కొడంగల్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ తొలి ఉద్యమ జ్యోతి ప్రొఫెసర్ జయశంకర్ గారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం కొడంగల్ లో రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లను కోల్పోయిన బాధిత ఇళ్ల యజమానులకు పరిహారం చెక్కులను మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహేసిల్దార్ రాంబాబు అందజేశారు.బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్,కో అప్షేన్ మెంబర్, మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి స్పందనతో గోపాలపురం పాఠశాలకు రూ.30 లక్షలు



**ఖమ్మం, ఆగస్టు 6 :** తిరుమలాయపాలెం మండలం గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితిపై వచ్చిన వార్తకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాఠశాల అభివృద్ధికి రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గురువారం పాఠశాలను సందర్శించిన కలెక్టర్ భవనం పరిస్థితి, విద్యార్థులకు ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా ప్రధానోపాధ్యాయురాలు నిమ్మతోట ఇందిరా తన సొంత నిధులతో రూ.40 వేల వ్యయంతో తాత్కాలిక షెడ్ నిర్మించి తరగతులు నిర్వహించడాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను శాలువాతో సన్మానించారు.మంజూరైన నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాల పునరుద్ధరణకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి స్వయంగా పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నందున నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

# TSWRS బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



**వికారాబాద్, ఆగస్టు,06**

వికారాబాద్ జిల్లా కొత్త గడి TSWRS బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి గురువారం జిల్లా కలెక్టర్ TSWRS బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లాలోని TWRS గురుకుల పాఠశాల, కళాశాలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, పలువురు విద్యార్థులు టీసీలు (TCలు) ఎందుకు తీసుకున్నారని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయడం లేదా ఇతర విద్యాసంస్థలకు వెళ్లే పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయో సమగ్రంగా సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థుల ప్రవేశాలు, హాజరు, డ్రాపౌట్‌లు, టీసీల జారీకి సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు.విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, వసతి, భోజనం తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.ఫిర్యాదులకు కారణమైన అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, హాస్టల్, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థినులతో మమేకమై వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి, మెనూ ప్రకారం భోజనం ఉండాలని,భోజన నాణ్యతపై ఆరా తీశారు. కిచెన్, స్టోర్ రూమ్, టాయిలెట్స్, పరిశీలించారు.ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు ప్రతి విద్యార్థినికి అందేలా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు లెక్చరర్ గా మారి లెక్కలు బోధించి వారితో సమాధానాలు చెప్పించారు.పాఠశాలలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించి,విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, కళాశాల ప్రిన్సిపాల్ సాయి లత, ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి,ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గుడ్డుతో ఇన్ని ప్రయోజనాలా?



గుడ్డు వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రతి రోజూ ఒక్క గుడ్డు తినాలని సూచిస్తున్నారు. గుడ్డు ప్రపంచవ్యాప్తంగా సూపర్ ఫుడ్ గా ప్రజాదరణ పొందింది. అవసరమైన పోషకాలు, విటమిన్లతో నిండి గుడ్లు వివిధ వంటకాల్లో చేర్చగల బహుముఖ పదార్థం. ఇకపోతే ప్రతిరోజూ గుడ్లు తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. గుడ్లు పోషక శక్తివంతమైనవి. వీటిలో అధిక స్థాయిలో ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవి మొత్తం ఆరోగ్యానికి ఎంతగానో అవసరం. వాటిని మీ ఆహారంలో ఎలా చేర్చాలో ఒకసారి చూద్దాం.



**ప్రొటీన్ పుష్కలం**

గుడ్లల్లో అధికంగా ప్రొటీన్ ఉంటుంది. ఇది శరీరంలో కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి అవసరం. ప్రొటీన్ మిమ్మల్ని పూర్తిగా, సంతృప్తిగా ఉంచడానికి కూడా సహాయపడుతుంది. వారి బరువును నిర్వహించాలని కోరుకునే వారికి గుడ్లు గొప్ప ఎంపికగా చేస్తాయి. గుడ్లలో విటమిన్ డి, విటమిన్ బి 12, సెలీనియం, కోలిన్ వంటి విటమిన్లు అలాగే మరికొన్ని ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు ఆరోగ్యకరమైన ఎముకలు, మెదడు పనితీరు, జీవక్రియను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

గుండె ఆరోగ్యానికి మంచిది:
ప్రజాదరణ పొందిన నమ్మకానికి విరుద్ధంగా, గుడ్లు వాస్తవానికి గుండె ఆరోగ్యానికి మంచివి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడే ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటాయి.

**కంటి ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది**

గుడ్లు లుటిన్, జియాక్సాంటిన్ వాటికి మంచి మూలం. ఇవి కంటి ఆరోగ్యానికి ప్రయోజనకరమైన రెండు యాంటీఆక్సిడెంట్లు. ఈ పోషకాలు వయస్సు సంబంధిత క్షీణత నుండి కళ్ళను రక్షించడానికి, మంచి దృష్టిని నిర్వహించడానికి సహాయపడతాయి. కండరాల పునరుద్ధరణలో సాయం గుడ్లలో అధిక ప్రొటీన్ కంటెంట్ వాటిని వ్యాయామం తర్వాత గొప్ప చిరుతిండిగా చేస్తుంది. వ్యాయామం తర్వాత గుడ్లు తినడం కండరాల పునరుద్ధరణను వేగవంతం చేయడానికి, కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది.

# పటిక బెల్లం తింటే .. ఆరోగ్యం



పటికబెల్లం అద్భుతమైన ఆహారమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చక్కెర, బెల్లం స్తానంలో దీన్ని వాడటం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. పటిక బెల్లం చెరకు రసం నుంచి తయారు చేస్తారు. తెల్ల చక్కెరలాగా దీన్ని ప్రాసెసింగ్ చేయరు. అయితే పటికబెల్లంతో లాభాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.



**పోషకాలు సమృద్ధిగా:**

పటిక బెల్లంలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, ఇతర ఖనిజాలు ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. సహజంగా వైట్ షుగర్ ప్రాసెసింగ్ చేసే క్రమంలో దానిలో ఉండే సహజసిద్ధమైన పోషకాలు బయటకు వెళ్లిపోతాయి. కానీ పటికబెల్లంలో అన్ని పోషకాలు ఉంటాయని నిపుణలు చెబుతన్నారు.

**రోగనిరోధక శక్తి కోసం కూడా..**

పటిక బెల్లంలో రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలు కూడా ఉన్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షించడానికి, అలాగే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడే యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. ఈ సహజ స్వీటెనర్ ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లను నివారించడానికి, అలాగే మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. పటిక బెల్లం అనేది తెల్ల చక్కెర లాగా రక్తంలో చక్కెర స్థాయిలలో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణం కాదు. ఇది తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. అంటే ఇది జీర్ణమవుతుంది. ఇంకా మరింత నెమ్మదిగా గ్రహించబడుతుంది. ఇది రక్తంలో చక్కెర వచ్చే చిక్కులను నివారించడానికి సహాయపడుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి లేదా వారి రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించాలని కోరుకునే వారికి ఇది మంచి ఎంపిక.

**జీర్ణక్రియకు తోడ్పడుతుంది**

పటిక బెల్లం జీర్ణ ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది సహజ విరోచనాల మందుగా కూడా పనిచేస్తుంది. అలాగే ప్రేగు కదలికలను ప్రేరేపించడం ద్వారా.. జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పటిక బెల్లంలో ఉండే ఖనిజాలు పోషకాలను గ్రహించడంలో కూడా సహాయపడతాయి. మొత్తం గట్ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.



# పోషకాల గని నువ్వులు.. తరుచూ తింటే?

నువ్వులు ఆరోగ్య ప్రయోజనాల కోసం, వంటలలో ఉపయోగం కోసం కొన్ని శతాబ్దాలుగా ఉపయోగించబడుతున్న శక్తివంతమైన పోషక శక్తులు. ఈ నువ్వులు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి సమతుల్య ఆహారంలో చేర్చినప్పుడు అనేకరకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇకపోతే నువ్వుల వల్ల కలిగే అనేక ఆరోగ్య ప్రయోజనాలను, అలాగే వాటిని మీ దినచర్యలో చేర్చడాన్ని ఎందుకు పరిగణించాలో ఒకసారి చూద్దాం.

పోషకాలు సమృద్ధిగా ఉంటాయి:
నువ్వులు మొత్తం ఆరోగ్యం, శరీర శ్రేయస్సును ప్రోత్సహించగల కీలక పోషకాలతో నిండి ఉంటాయి. అవి రాగి, మాంగనీస్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, భాస్వరం, జింక్, విటమిన్ బీ6 లాంటి వాటికి అద్భుతమైన మూలం. ఈ పోషకాలు ఎముక ఆరోగ్యం, శక్తి ఉత్పత్తి, రోగనిరోధక వ్యవస్థ మద్దతుతో సహ వివిధ శారీరక విధుల్లో కీలక పాత్ర పోషిస్తాయి.

గుండె ఆరోగ్యం
నువ్వులలో మోనోశాచురేటెడ్ కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. ఇవి గుండెకు ఆరోగ్యకరమైన కొవ్వులు. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. వీటిలో ఫైటోస్టెరాల్స్ కూడా ఉంటాయి. ఇవి రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయని తేలింది. అంతేకాకుండా నువ్వులు సెసమోల్, సెసమిన్ వంటి యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి, వాపు నుండి గుండెను రక్షించగలవు.

జీర్ణ ఆరోగ్యం
నువ్వులు డైటరీ ఫైబర్ కు మంచి మూలం. ఇది జీర్ణ ఆరోగ్యానికి చాలా అవసరం. ఫైబర్ మలానికి పెద్ద మొత్తంలో జోడించడం ద్వారా మలబద్ధకాన్ని నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా నువ్వులలో లిగ్నాన్స్ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ప్రయోజనకరమైన బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తూ గట్ మైక్రోబయోటాపై ప్రీబయోటిక్ ప్రభావాన్ని చూపుతాయని తేలింది.

ఎముకల ఆరోగ్యం
నువ్వులలో కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముక ఆరోగ్యానికి అవసరమైన ఖనిజాలు. ఈ ఖనిజాలు బలమైన, ఆరోగ్యకరమైన ఎముకలను నిర్వహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. బోలు ఎముకల వ్యాధి, పగుళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మీ ఆహారంలో నువ్వులను చేర్చడం, ఎముక సాంద్రత, మొత్తం అస్థిపంజర ఆరోగ్యానికి సహాయపడుతుంది.

యాంటీఆక్సిడెంట్ గుణాలు
నువ్వులు యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి, ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు వాపును తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, మొత్తం ఆరోగ్యం, శరీర శ్రేయస్సుకు సహాయపడతాయి. మీ ఆహారంలో నువ్వులను చేర్చడం వల్ల దీర్ఘాయువును ప్రోత్సహించడానికి, దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి సహాయపడుతుంది.

# భారత్-దక్షిణాఫ్రికా మహిళల సిరీస్ షెడ్యూల్‌లో మార్పులు



- మూడు టీ20లు అదనం.. పర్యటన మరో వారం పొడిగింపు
- ఛాంపియన్స్ ట్రోఫీ సన్నాహకంగా కొత్త సిరీస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా పర్యటన షెడ్యూల్‌లో క్రికెట్ సౌతాఫ్రికా కీలక మార్పులు చేసింది. ముందుగా ప్రకటించిన ఒక టెస్టు, మూడు వన్డే మ్యాచ్‌లతో పాటు తాజాగా మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను కూడా చేర్చింది. దీంతో భారత జట్టు మరో వారం రోజుల పాటు దక్షిణాఫ్రికాలోనే పర్యటించనుంది. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 9 నుంచి 12 వరకు గెబెర్హాలో ఏకైక టెస్టు మ్యాచ్ జరగనుంది. అనంతరం డిసెంబర్ 16, 19, 22 తేదీల్లో పార్ల్, కేప్‌టౌన్, బ్లోమ్‌ఫోంటెన్ వేదికలుగా మూడు వన్డేలు నిర్వహించనున్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 26, 28, 30 తేదీల్లో బెనోని, పోచెఫ్‌స్ట్రూమ్ వేదికలుగా మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో శ్రీలంక వేదికగా జరిగే తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి ఈ టీ20 సిరీస్ చక్కటి సన్నాహకంగా ఉపయోగపడుతుందని క్రికెట్ సౌతాఫ్రికా పేర్కొంది. ప్రపంచంలోనే బలమైన జట్లలో ఒకటైన భారత జట్టుతో మూడు ఫార్మాట్లలో పోటీపడటం తమ ఆటగాళ్లకు విలువైన అనుభవాన్ని అందిస్తుందని క్రికెట్ సౌతాఫ్రికా సీఈఓ ఫోలెట్సీ మోసెకి తెలిపారు. ఇటీవలి రికార్డుల ప్రకారం, ఈ ఏడాది మార్చి-ఏప్రిల్‌లో జరిగిన టీ20 సిరీస్‌లో దక్షిణాఫ్రికా 4-1 తేడాతో భారత్‌ను ఓడించింది. అనంతరం ఇంగ్లాండ్‌లో జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లోనూ దక్షిణాఫ్రికా చేతిలో ఓడిన భారత్ సెమీఫైనల్ అవకాశాలను కోల్పోయింది. ఇప్పుడు జరిగే కొత్త టీ20 సిరీస్ ఆ పరాజయాలకు ప్రతీకారం తీర్చుకునే అవకాశంగా భావిస్తున్నారు.



# ఆసియా కప్ షెడ్యూల్ విడుదల

**సెప్టెంబర్ 5న భారత్-పాకిస్థాన్ హైఓల్టేజ్ పోరు**

**ఆగస్టు 28 నుంచి దుబాయ్ వేదికగా మహిళల ఆసియా కప్**

**దుబాయ్, ఆగస్టు 6:** క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మహిళల ఆసియా కప్ షెడ్యూల్‌ను ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) విడుదల చేసింది. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఆగస్టు 28 నుంచి ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ ప్రారంభం కానుంది. ఇందులో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 5న జరగనుంది. ఇటీవల మహిళల వన్డే ప్రపంచకప్‌లో తలపడిన భారత్, పాకిస్థాన్ జట్లు మరోసారి ఆసియా కప్ వేదికగా అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిళల ఆసియా కప్‌లో ఆసియా ఖండానికి చెందిన అగ్ర జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆసియా క్రికెట్ మండలి తెలిపింది. భారత్‌తో పాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర జట్లు ఈ మెగా టోర్నీలో పాల్గొననున్నాయి. భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ లభించే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పోరు టోర్నీలోనే అత్యంత కీలక ఆకర్షణగా నిలవనుంది.

# ‘నాలో ఇంకా సత్తా తగ్గలేదు’

**జట్టులోకి రీఎంట్రీ లక్ష్యంగా షమీ తీవ్ర సాధన**

**ఐదు కిలోలు బరువు తగ్గిన స్టార్ పేసర్**

**సెలక్టర్లకు పరోక్ష హెచ్చరిక.. మళ్లీ టీమిండియాలో చోటే లక్ష్యం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ జాతీయ జట్టులోకి పునరాగమనమే లక్ష్యంగా కఠోరంగా శ్రమిస్తున్నాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టుకు దూరమైన షమీ, తనలో ఇంకా ఎంతో క్రికెట్ మిగిలి ఉందని నిరూపించేందుకు సిద్ధమయ్యాడు. దేశవాళీ క్రికెట్‌లో వరుసగా అద్భుత ప్రదర్శనలు చేసినప్పటికీ సెలక్టర్లు అవకాశమివ్వకపోవడంతో ఇప్పుడు తన ఫిట్‌నెస్, ఫామ్‌తోనే సమాధానం చెప్పాలని భావిస్తున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన షమీ, గత రంజీ ట్రోఫీలో 7 మ్యాచ్‌ల్లో 37 వికెట్లు, విజయ్ హజారే ట్రోఫీలో 7 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి తన పదును ఏమాత్రం తగ్గలేదని చాటాడు. అయినప్పటికీ జాతీయ జట్టులో అవకాశం రాకపోవడంతో రీఎంట్రీ కోసం మరింత పట్టుదలతో సాధన కొనసాగిస్తున్నాడు. షమీ బాల్య కోచ్ మహమ్మద్ బద్రుద్దీన్ మాట్లాడుతూ, రాబోయే సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని షమీ ఐదు కిలోల బరువు తగ్గాడని తెలిపారు. అతను శారీరకంగానే కాదు, మానసికంగానూ ఎంతో దృఢంగా ఉన్నాడని, దేశానికి అవసరమైతే మళ్లీ అత్యుత్తమ స్థాయిలో ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో భారత పేస్ దాడి ఆశించిన స్థాయిలో రాణించలేదని, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ గాయాలు, ఇతర బౌలర్ల అనుభవలేమి జట్టును ప్రభావితం చేశాయని బద్రుద్దీన్ అభిప్రాయపడ్డారు. అలాంటి పరిస్థితుల్లో షమీ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడేదని పేర్కొన్నారు. 2027 దక్షిణాఫ్రికా వన్డే ప్రపంచకప్‌లో కూడా అతని అనుభవం భారత్‌కు కీలకమవుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా, అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానేకు షమీ సోషల్ మీడియా ద్వారా అభినందనలు తెలిపాడు. రహానే క్రమశిక్షణ, అంకితభావం, జట్టుకు అందించిన సేవలు ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడాడు. ఇదే సమయంలో షమీని మళ్లీ భారత జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ అభిమానులు, మాజీ క్రికెటర్ల నుంచి కూడా బలంగా వినిపిస్తోంది.






# వన్డే ప్రపంచకప్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం

**2027 క్వాలిఫయర్ షెడ్యూల్ విడుదల చేసిన ఐసీసీ**

**ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు అర్హత పోటీలు**

**వెస్టిండీస్‌కు మరోసారి క్వాలిఫయర్స్ గండం**

**దుబాయ్, ఆగస్టు 6:** ప్రతిష్టాత్మక 2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ మెగా టోర్నీకి అర్హత సాధించే జట్ల కోసం నిర్వహించే క్వాలిఫయర్ టోర్నీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. 2027 ప్రపంచకప్ క్వాలిఫయర్ పోటీలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు జరగనున్నాయి. అయితే ఈ టోర్నీకి ఆతిథ్యమిచ్చే వేదికను ఇంకా ఖరారు చేయలేదు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా నిర్వహించనున్న 2027 వన్డే ప్రపంచకప్ అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు 12 వేదికల్లో జరగనుంది. కొత్త ఫార్మాట్ ప్రకారం క్వాలిఫయర్ టోర్నీలో 10 జట్లు పోటీపడతాయి. ఇందులో విజేతగా నిలిచిన జట్టు నేరుగా ప్రపంచకప్ ప్రధాన దశకు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిరీస్ తొలి దశలో తలపడతాయి. ఆ పోటీల్లో అగ్రస్థానంలో నిలిచే జట్టుకు ప్రపంచకప్‌లో మరో బెర్త్ దక్కుతుంది. క్వాలిఫయర్‌లో పాల్గొనే 10 జట్ల ఎంపిక కూడా ఆసక్తికరంగా ఉండనుంది. 2026 సెప్టెంబర్ 30 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వే మినహా అత్యల్ప ర్యాంక్‌లో ఉన్న ఇద్దరు పూర్తి సభ్య దేశాలు క్వాలిఫయర్స్ ఆడాల్సి ఉంటుంది. వీటితో పాటు వరల్డ్ కప్ లీగ్-2లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు, క్వాలిఫయర్ ప్లేఆఫ్స్ నుంచి అర్హత సాధించిన మరో నాలుగు జట్లు పోటీలోకి వస్తాయి. ప్లేఆఫ్స్‌లో లీగ్-2లో చివరి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు, ఛాలెంజ్ లీగ్ నుంచి వచ్చిన నాలుగు జట్లు తలపడతాయి. ఛాలెంజ్ లీగ్‌లో 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించి లీగ్ దశ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మాజీ ప్రపంచ ఛాంపియన్ వెస్టిండీస్‌కు ఈసారి కూడా క్వాలిఫికేషన్ సవాలుగా మారింది. ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 10వ స్థానంలో ఉన్న విండీస్, సెప్టెంబర్ కట్‌ఆఫ్‌కు ముందు భారత్‌తో రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. అఫ్గానిస్థాన్--ఐర్లాండ్ సిరీస్ ఫలితాలు కూడా వెస్టిండీస్ భవితవ్యాన్ని ప్రభావితం చేయనున్నాయి. ఐర్లాండ్ భారీ తేడాతో సిరీస్ గెలిచి, వెస్టిండీస్ భారత్‌పై రెండు విజయాలు సాధిస్తేనే టాప్-8లోకి చేరే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో 2023లో మాదిరిగానే మరోసారి ప్రపంచకప్ అర్హత కోసం క్వాలిఫయర్స్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.



# నెట్స్‌లో గాయపడిన గిల్

**బొటనవేలికి బంతి తాకడంతో అభిమానుల్లో ఆందోళన**

**చికిత్స అనంతరం మళ్లీ బ్యాటింగ్.. శ్రీలంక టెస్టుకు సిద్ధమే**

**కొలంబో, ఆగస్టు 6:** శ్రీలంకతో జరిగే టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టుకు మరో గాయాల భయం పట్టుకుంది. నెట్స్‌లో సాధన చేస్తున్న సందర్భంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బొటనవేలికి బంతి బలంగా తగలడంతో కాసేపు మైదానంలో నొప్పితో విలవిల్లాడాడు. అయితే వెంటనే వైద్య బృందం చికిత్స అందించగా, కొద్దిసేపటి తర్వాత గిల్ మళ్లీ బ్యాటింగ్ సాధన కొనసాగించడం జట్టు యాజమాన్యానికి ఊరటనిచ్చింది. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత శ్రీలంక గడ్డపై టెస్టు సిరీస్ ఆడనున్న భారత జట్టు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఏకైక వార్మప్ మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. 2017లో చివరిసారిగా శ్రీలంకలో టెస్టు ఆడిన భారత జట్టులో ప్రస్తుతం లోకేష్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లకు మాత్రమే అక్కడ ఆడిన అనుభవం ఉంది. ఇప్పటికే స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా టెస్టు సిరీస్ మొత్తానికి దూరమవగా, అతని స్థానంలో ఆకిబ్ నబీని ఎంపిక చేశారు. మరో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా తొడ కండరాల గాయంతో తొలి టెస్టుకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో భారత పేస్ దాడికి మహమ్మద్ సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. అతనికి ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మానవ్ సుథార్, సారాంశ్ జైన్ సహకరించనున్నారు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో కూడా తొడ కండరాల సమస్యతో ఇబ్బంది పడిన గిల్ పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని కెప్టెన్ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇక వార్మప్ మ్యాచ్ కోసం శ్రీలంక బోర్డు సోనల్ దినుషా నాయకత్వంలో బలమైన జట్టును ప్రకటించింది. లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, రమేష్ మెండిస్ వంటి అనుభవజ్ఞులు ఇందులో చోటు దక్కించుకున్నారు. స్థానిక పరిస్థితులకు అలవాటు పడేందుకు ఈ వార్మప్ మ్యాచ్ భారత జట్టుకు కీలకంగా మారనుంది.

# ‘మన హద్దులు దాటాలి’

**శ్రీలంక టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియాకు గంభీర్ హెచ్చరిక**

**ప్రతి సవాల్‌కు సిద్ధంగా ఉండాలన్న హెడ్ కోచ్**

**కొలంబో, ఆగస్టు 6:** శ్రీలంకతో జరగనున్న కీలక టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టుకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గట్టి సందేశం ఇచ్చాడు. ప్రతి ఆటగాడు తన హద్దులను దాటి మరింత కష్టపడాలని, మానసికంగా, శారీరకంగా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించాడు. ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టు ప్రస్తుతం కొలంబోలో ముమ్మర సాధన కొనసాగిస్తోంది. బీసీసీఐ టీవీతో మాట్లాడిన గంభీర్, “మన ముందున్న సవాలు ఏమిటో అందరికీ తెలుసు. గతంలో కంటే ఎక్కువగా శ్రమించాలి. తొలి రోజు నుంచే బ్యాటింగ్ అయినా, బౌలింగ్ అయినా ప్రత్యర్థి విసిరే ప్రతి సవాల్‌కు మన దగర సమాధానం ఉండాలి. అందుకే ఇప్పటి నుంచే అన్ని అంశాల్లో సిద్ధంగా ఉండాలి” అని ఆటగాళ్లకు పిలుపునిచ్చాడు. ఆగస్టు 7 నుంచి 9 వరకు కొలంబోలో మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడనున్న భారత జట్టు, అనంతరం గాలేకు చేరుకుని ఆగస్టు 15న తొలి టెస్టులో శ్రీలంకను ఎదుర్కొంటుంది. ఈ సందర్భంగా భారత టెస్టు జట్టులో కొత్తగా చోటు దక్కించుకున్న ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్, యువ పేసర్ ఆకిబ్ నబీకి గంభీర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపాడు. కొత్త ఫీల్డింగ్ కోచ్ శుభదీప్ ఘోష్‌కు కూడా జట్టులోకి స్వాగతం పలుకుతూ, ఆయన అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (2025-27) పాయింట్ల పట్టికలో భారత్ 48.15 శాతం పాయింట్లతో ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక 41.67 శాతం పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. దీంతో ఈ సిరీస్ ఇరు జట్లకు అత్యంత కీలకంగా మారింది. శ్రీలంకలో సిన్‌కు అనుకూలించే పిచ్‌లు. స్వదేశీ పరిసితులు బారత్‌కు



సవాల్‌గా మారే అవకాశం ఉంది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో బలంగా నిలవాలంటే ఈ సిరీస్‌లో విజయమే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగనుంది. గంభీర్ సందేశం జట్టులో మరింత పోరాటస్ఫూర్తిని నింపేలా ఉందని క్రికెట్ వరాలు బావిసునాయి.

# నవంబర్ 6న 'రామాయణ' విడుదల








### ప్రపంచవ్యాప్తంగా విడుదల తేదీ ప్రకటించిన చిత్ర బృందం

### రూ.4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న విజువల్ ఎపిక్

**ముంబై, ఆగస్టు 6:** దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న 'రామాయణ' చిత్రం తొలి భాగం నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. గతంలోనే రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించిన మేకర్స్, తాజాగా తొలి భాగం విడుదల తేదీని ఖరారు చేశారు. నవంబర్ 6న హీరో రణ్‌బీర్ కపూర్ కుమార్తె రాహా పుట్టినరోజు కూడా కావడంతో ఈ విడుదల ఆయనకు మరింత ప్రత్యేకంగా మారనుంది. ఈ చిత్రం భారతీయ ఇతిహాసాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించే ప్రయత్నంగా రూపొందుతోంది. చిత్రంలో మండోదరి పాత్ర పోషిస్తున్న కాజల్ అగర్వాల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'రామాయణ' అత్యంత వైభవంగా రూపొందుతోందని చెప్పారు. భారతీయ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడానికి రామాయణ కంటే గొప్ప కథ మరొకటి లేదని, ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకునే కథలను రూపొందించే సామర్థ్యం భారతీయ సినీ పరిశ్రమకు ఉందని ఆమె పేర్కొన్నారు. సుమారు రూ.4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయిపల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## తండ్రి నాగబాబుతో వరుణ్ తేజ్ బరి

### కూతురు నీహారికి నిర్మాతగా యదువంశీ మూవీ





మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ముందు చిత్రబృందం జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తుండగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ తన తదుపరి సినిమా గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తొలిసారిగా తన తండ్రి నాగబాబుతో కలిసి ఒకే సినిమాలో నటించబోతున్నట్లు ప్రకటించారు. నాగబాబు నటుడిగా చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, సాయిధరమ్ తేజ్ సహా మెగా కుటుంబానికి చెందిన పలువురు హీరోలతో కలిసి నటించారు. అయితే ఆశ్చర్యకరంగా తన కుమారుడు వరుణ్ తేజ్‌తో మాత్రం ఇప్పటివరకు పూర్తి స్థాయి సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకోలేదు. గతంలో 'హ్యాండ్స్ అప్' సినిమాలో వరుణ్ తేజ్ చిన్ననాటి పాత్రలో కనిపించినప్పటికీ, తండ్రీకొడుకుల మధ్య ఒక్క కాంబినేషన్ సీన్ కూడా లేదు. ఇప్పుడు ఆ లోటును 'బరి' సినిమా భర్తీ చేయనుంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్, నాగబాబు కలిసి నటించడమే కాకుండా, ఇద్దరి మధ్య కీలకమైన కాంబినేషన్ సీన్లు కూడా ఉంటాయని వరుణ్ వెల్లడించారు. తండ్రితో కలిసి నటించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇక 'బరి' చిత్రాన్ని నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల నిర్మిస్తున్నారు. 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యదు వంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కాలికి గాయం కారణంగా విశ్రాంతి తీసుకున్న వరుణ్ తేజ్, పూర్తిగా కోలుకున్న తర్వాత 'బరి' షూటింగ్ ప్రారంభం కానుందని తెలిపారు. తొలిసారి రియల్ లైఫ్ తండ్రీకొడుకులు వెండితెరపై కలిసి కనిపించనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌పై మెగా అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. 'కొరియన్ కనకరాజు' తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌లో 'బరి' మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# 'కింగ్ జాకీ క్వీన్' వెనుక ఆసక్తికర కథ

### అనుష్క కోసం 12 ఏళ్ల క్రితమే సిద్ధమైన స్క్రిప్ట్‌గా ప్రచారం

### సందీప్ రెడ్డి వంగా వ్యాఖ్యలతో సినిమాపై పెరిగిన ఆసక్తి

**హైదరాబాద్, ఆగస్టు 6:** ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానున్న తెలుగు చిత్రం 'కింగ్ జాకీ క్వీన్' విడుదలకు ముందే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించగా, తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాను ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ దర్శకత్వం వహించిన చివరి చిత్రం ఇదే కావడం ఈ సినిమాకు మరో ప్రత్యేకత. సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, ఈ కథను దర్శకుడు కిరణ్ కుమార్ దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన ఆయన, కథానాయిక పాత్రను స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి కోసం ప్రత్యేకంగా రూపొందించారని తెలిపారు. అయితే అనివార్య కారణాలతో ఆ ప్రాజెక్టు అప్పట్లో కార్యరూపం దాల్చలేదన్నారు. అయినా కథను పక్కన పెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేసిన కిరణ్ కుమార్, చివరకు దానిని 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారని చెప్పారు. తొలుత అనుష్క కోసం రాసిన పాత్రే ప్రస్తుతం యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపాంతరం చెందిందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంతో మరో విశేషం కూడా ఉంది. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోదరుడు శశి ఓదెల హీరోగా పరిచయం అవుతుండగా, తొలి చిత్రానికే పీరియాడిక్ క్రైమ్ డ్రామా వంటి భిన్న కథను ఎంచుకోవడం విశేషంగా మారింది. దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటిస్తుండగా, చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు పూర్ణచంద్ర తేజస్వి సంగీతం సమకూర్చారు. విడుదలకు ముందే ప్రచారంలో నిలిచిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని సాధిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.




## చకచకా రాకా మూవీ షూటింగ్

### మెటర్నిటీ బ్రేక్‌లో దీపికా పడుకొణె



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎ÷–లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com